వార్త

ఆదివారం

1 అక్టోబరు, 2023




# 'జమిలి' గుబులు!



# రవితేజ జోడీగా
# రష్మిక మందన్న?



**మాస్** మహారాజా హీరోగా ప్రస్తుతం పాన్ ఇండియా మూవీ 'టైగర్ నాగేశ్వరరావు'తో పాటు మరో సినిమా 'ఈగిల్' తెరకెక్కుతోంది. ఈ రెండు సినిమాలపై ఆయన అభిమానులతో పాటు ప్రేక్షకుల్లో సైతం మంచి అంచనాలు ఉన్నాయి. ఈ రెండు చిత్రాల తరువాత గోపీచంద్ మలినేనితో ఒక మాస్ యాక్షన్ మూవీ చేయనున్నారు రవితేజ. మైత్రీ మూవీ మేకర్స్ వారు గ్రాండ్ లెవెల్లో నిర్మించనున్న ఈ సినిమాలో రష్మిక మందన్న కథానాయికగా నటించనున్నారని తాజా సమాచారం. గతంలో రవితేజ, గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో వచ్చిన డాన్ శ్రీను, బలుపు, క్రాక్ సినిమాలు మూడు కూడా సూపర్ హిట్ అందుకోవడంతో ఈ సినిమా కూడా సూపర్ హిట్ ఖాయం అని అందరూ భావిస్తున్నారు. ఈ చిత్రం గురించి మరిన్ని వివరాలు త్వరలో వెల్లడి కానున్నాయి.



## తారాతీరం

# ముఖ్య పాత్రలో రాజ్ తరుణ్!

అక్కినేని నాగార్జున హీరోగా శ్రీనివాస సిల్వర్ స్క్రీన్ బ్యానర్‌పై అత్యంత భారీ స్థాయిలో నిర్మితం కానున్న లేటెస్ట్ మూవీ 'నా సామిరంగ'. దీనిని శ్రీనివాస చిట్టూరి నిర్మిస్తుండగా ఈ చిత్రంతో ప్రముఖ కొరియోగ్రాఫర్ విజయ్ బిన్నీ దర్శకుడిగా మెగాఫోన్ పడుతున్నారు. ఎమ్ఎమ్ కీరవాణి సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రంలో నాగార్జున మాస్ పాత్ర చేస్తుండగా, ఒక ముఖ్య పాత్రలో అల్లరి నరేష్ నటించనున్నట్లు గతంలో వార్తలు వచ్చాయి. తాజా సమాచారం ప్రకారం మరో యువ నటుడు రాజ్ తరుణ్ కూడా మరో ముఖ్య పాత్ర చేయనున్నట్లు తెలుస్తోంది. త్వరలో ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు వెల్లడి కానున్నాయి. ఈ సినిమా 2024 సంక్రాంతి కానుకగా విడుదల కానుంది.

ఆదివారం వార్త
1 అక్టోబరు, 2023

## మంచి ముత్యాలు

మనసులో మాలిన్యం ఉన్నపుడు మెదడు
ఎంత బాగా పనిచేస్తున్నా ఏమి ప్రయోజనం?

- యూంగ్

## విషయ విశేషం

ప్రకృతి సేద్యం... 4
'సంఘీ'భావం....5
చట్టసభల్లో ఇక మహిళా'మణులు'
కవర్ స్టోరీ..6
'జమిలి' గుబులు!
జపాన్, కొరియాలో ఉన్నత విద్య..11
ఈవారం కవిత్వం..12
చెట్లు మాట్లాడుతున్నాయి..!
మనసా! కృంగిపోకు....14
కథ.. 20
ఇష్టసఖి
సాహిత్యం..23
పీడితుల వెతలు-రా.వి.శాస్త్రి
కన్నీటి బిందువు ఆకారంలో శ్రీలంక...25
పశ్చిమ వాయవ్యంలో సెప్టిక్ ట్యాంక్ ఉంటే?...29
ఇంకా..
పుస్తక సమీక్ష
మొగ్గ
వారఫలం
వగైరా..వగైరా..

## తాజా వార్తలు

### గుర్రం బడికెళుతుంది



బస్సు, వ్యాను, ఆటోల వంటి వాహనాలపైన పిల్లలు స్కూలుకి వెళ్లడం మనకు తెలిసిందే. రోడ్లు సరిగా లేని ప్రాంతాల్లోనూ, కొండకోనలు దాటాల్సి వచ్చినప్పుడూ గుర్రాలపైన వెళుతుంటారు. కానీ సొంతూళ్లోనే స్కూలు ఉండీ, అన్ని రకాల సౌకర్యాలున్నా కూడా ఓ కుర్రాడు రోజూ గుర్రంపైనే బడికి వెళుతున్నాడు. అది సరదాకో, డాబు చూపించడానికో అనుకుంటే పొరపాటు. కేవం స్నేహంతోనే ఆ పని చేస్తున్నాడు. గుజరాత్‌లోని ఖార్వాసా గ్రామానికి చెందిన మహేశ్ ఒకసారి తండ్రితో కలిసి పొలానికి వెళ్లాడు. అప్పుడు రోడ్డు పక్కన తుప్పల్లో గాయపడిన గుర్రం పిల్ల కనిపిస్తే తండ్రి వద్దన్నా ఇంటికి తీసుకొచ్చాడు. వైద్యం చేయించి దానికి సపర్యలు చేసి బాగు చేశాడు. అలా మహేశ్‌కి దగ్గరైన ఆ గుర్రం పిల్ల కాసేపు కూడా అతడిని వదిలిపెట్టి ఉండదు. అయితే వేసవి సెలవులు పూర్తై ఆ కుర్రాడు స్కూలుకి వెళ్లినప్పుడు దాని బాధ అంతాఇంతా కాదు. బెంగతో తిండీ నీళ్లూ మానేసింది. ఒకరోజు మహేష్‌ను వెతుక్కుంటూ స్కూలుకు వెళ్లింది. క్లాస్ అయ్యే వరకూ ఆవరణలో ఆ పిల్లాడి కోసం ఎదురు చూసింది. దాంతో గుర్రాన్ని కూడా రోజూ స్కూలుకు తీసుకెళితే దానికి బెంగ ఉండదని ఆలోచించి హెడ్‌మాస్టర్ వద్ద అనుమతి తీసుకున్నాడు. నాలుగేళ్లుగా గుర్రంపైన బడికి వెళ్లే మహేశ్ పుస్తకాలతో పాటు కాస్త గడ్డి కూడా వెంట తీసుకెళ్లి అక్కడ దనికి మేత వేస్తుంటాడు. విరామం, భోజనం సమయంలో దానితో ఆడుకుంటూ ఉంటాడు.ఇప్పుడు ఆ గుర్రం స్కూల్లో మహేశ్‌తోపాటు మిగతా పిల్లలతోనూ స్నేహం చేస్తోంది.

### జోక్స్..జోక్స్..

రాము: పెళ్లిపై నీ అభిప్రాయం ఏంటి రాము?
గోపి: ఏముంది తొందరగా పెళ్లి చేసుకున్నోడు తాతగా పోతాడు. లేటుగా పెళ్లి చేసుకున్నోడు తండ్రిగా పోతాడు, అసలు పెళ్లే చేసుకోనివాడు బతికిపోతాడు.

...

చింటూ: ఏమైంది నిన్ను ఆసుపత్రిలో చేర్చారంటగా?
పండు: ఏం లేదు నెట్ ఆఫర్ అయిపోయింది. రాత్రి 9గంటలకే పడుకున్నాను. దాంతో అందరూ కంగారుపడి ఆసుపత్రిలో చేర్చారు.

మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. sunmagvaartha@gmail.com





# ప్రకృతి సేద్యం



ఇక్కడ గుట్టలుగా ఉన్న దుంగలు మిల్లుల్లో కోత కోసం ఉంచినవో, పంట చెరకు కోసం పెట్టినవో కాదు. వీటి ప్రయోజనం వేరే ఉంది. జపాన్‌లో షిటాకో రకం పుట్ట గొడుగుల వినియోగం ఎక్కువ. పోషకాలతోపాటు, అమోఘమైన రుచి వాటి సొంతం. అందుకు తగ్గట్టే ధర కూడా! వీటి పెంపకానికి వందల ఏళ్ల కిందటే వాళ్లో సహజమైన మార్గాన్ని కనిపెట్టారు. చెట్ల కాండాలపైన తామరతంపరగా పుట్ట గొడుగులు పెరగడం తెలిసిందేగా! అదే పద్ధతిలో వీళ్లు దుంగల్ని ఉపయోగిస్తున్నారన్నమాట. దుంగలపైన చిన్న చిన్న రంధ్రాలు చేసి అందులో పుట్ట గొడుగుల వితనం (శిలీంధ్ర జాలం) పెడతారు. ఆపైన తేమ వాతావరణంలో క్రమపద్ధతిలో పేర్చుతారు. ఏడాదికి వాటి నుంచి పుట్టగొడుగులు వస్తాయి. ఆ తర్వాత దుంగల్ని ఓసారి బాగా తడిపితే మూడు నెలలకు రెండో విడత దిగుబడి వస్తుంది. ప్రకృతి సేద్యం అంటే ఇదేనేమో!







# 'సంఘీ' భావం



## చట్టసభల్లో ఇక మహిళా'మణులు'

చిరకాలం నాటి ఆకాంక్ష, ప్రయత్నం చట్టసభల్లో మహిళా రిజర్వే షన్ల సాధన ఎట్టకేలకు ఎన్నో అవరోధాలు దాటి పట్టాలు ఎక్కిం ది. ఇప్పటికిప్పుడు కొన్ని సాంకేతికపరమైన అంశాల వల్ల ఈ బిల్లులోని అంశాలు అమలులోకి రాకపోయినా రాబోయే ఎన్నికల నాటికి మహిళలకు పూర్తి స్థాయి ప్రయోజనాలు కలుగుతాయి. బిల్లుపై మెజారిటీ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నా కొన్ని వర్గాలు మాత్రం పురుషాధ్యికత కలిగిన సమాజంలో కొన్ని ఇబ్బందులు తప్పవని అంటున్నారు. ప్రధానంగా రాజకీయాల్లో ప్రాతినిధ్యం వహిస్తూ పూర్తి స్థాయి పట్టు సాధించిన నాయకులు తమ కుటుంభసభ్యులైన మహిళలకు తమ స్థానాన్ని కల్పించి గెలిపించు కున్నప్పటికీ వారి ఆధ్వర్యంలో కాకుండా తెరవెనుక నుంచి తామే పాలన సాగించే అవకాశం ఉంటుందని పెదవి విరుస్తున్నారు. ఇప్పటికే స్థానిక సంస్థల్లో కొన్ని ప్రాంతాల్లో సర్పంచ్‌లు, కార్పొరేటర్లు, మేయర్లుగా మహిళలు అధికారంలో ఉన్నా వారి భర్తల ఆధిపత్యం పూర్తిస్థాయిలో కొనసాగుతోంది. ఇదే పరిస్థితి చట్టసభల్లో కూడా అమలు అయ్యే అవకాశాలు అధికంగా ఉన్నా యని ఆ వర్గం భావిస్తోంది. మరోపక్క రాజకీయంగా బలమైన కుటుంబం నుంచి మహిళలను సాధారణ మహిళలు ఎదుర్కొనే అవకాశాలు తక్కువగా ఉంటాయి. ఈ కారణంగా రాజకీయపర మైన మార్పులు అంతగా ఉండవని వారు వాదిస్తున్నారు. ఇలాంటి ఘటనలు కొన్ని మాత్రమే ఉన్నాయని, చాలా ప్రాంతాల్లో మహిళలు స్వతంత్రంగా అధికారం చలాయి స్తున్నారని, ముందు మహిళలకు ప్రాతినిధ్యం వహించే అవకాశం ఇస్తే క్రమంగా మార్పు కనిపిస్తుందని ఈ బిల్లు ఆశావహులు పేర్కొంటున్నారు. మహిళల కు సముచిత స్థానం కల్పించాలని ఎప్పటి నుంచో జరుగుతున్న పోరాటాలకు ఎట్టకేలకు ఈ బిల్లు రెండు సభల్లో మంజూరు కావ డం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. మహిళలకు ప్రాతి నిధ్యం, సమాన భాగస్వామ్యం కల్పించాలన్న ప్రయత్నాలు స్వాతంత్ర్యానికి ముందు నుంచే జరుగుతున్నాయి. సరోజినీనాయుడు, బేగం షానవాజ్‌లు 1931 లోనే బ్రిటీష్ ప్రధాని వద్ద ఈ డిమాండ్లను పెట్టడం జరి గింది. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఈ డిమాండ్ మరింతగా పెరిగిం ది. పలు సందర్భాల్లో ఈ ప్రయత్నాలు సాఫల్యం కావడానికి రెండు మూడు అడుగుల దూరంలో నిలిచిపోయిన సందర్భాలు ఉన్నాయి. ప్రపంచవ్యాప్తం గా మహిళల చట్టసభల ప్రాతినిధ్యం పరిశీలిస్తే సగటున 25 శాతం ఉండగా మన దేశంలో మాత్రం కేవలం 15శాతం మాత్రమే ఉందని అధ్యయనాలు చెబుతున్నా యి. ఇదే రాష్ట్రాల స్థాయికి వచ్చే సరికి మరింతగా దిగజారి 9 శాతం వద్ద నిలిచిపోయింది. 1996లో దేవగౌడ ప్రధానమంత్రిగా ఉన్న యునైటెడ్ ఫ్రంట్ మహిళలకు చట్టసభల్లో 33 శాతం స్థానాలను రిజర్వ్ చేస్తూ 81వ రాజ్యాంగ బిల్లును తీసుకు వచ్చింది. అయితే అప్పట్లో పూర్తి స్థాయి మెజారిటీ లేకపోవడంతో బిల్లు అమలులో సమస్యలు ఏర్పడ్డాయి. అనంతరం లోక్‌సభ రద్దు కావడంతో ఈ బిల్లును పట్టించుకునే వారు లేకుండా పోయారు. 1998లో అటల్ బిహారీ వాజ్‌పాయి హయాంలో కూడా మరోసారి బిల్లు ప్రతిపాదనలు జరిగాయి. ఎన్‌డియే ప్రభుత్వం ఈ బిల్లును ప్రవేశపెట్టడం ఆమోదం పొందకపోవడం కూడా చకాచకా జరిగిపోయాయి. అదే విధంగా 1999, 2002, 2003లలో కూడా మహిళా రిజర్వేషన్ బిల్లులు ప్రవేశపెట్టినా ఆమోదం పొందలేదు. 2008లో మన్మోహన్‌సింగ్ ప్రధానమంత్రి గా ఉన్న సమయంలో యుపియే ప్రభుత్వం ఈ బిల్లును ప్రవేశపెట్టింది. అయితే దురదృష్టవశాత్తు రాజ్యసభలో ఈ బిల్లు ఆమోదం పొందలేదు. మహిళా బిల్లు పట్ల అన్ని రాజకీయపార్టీలు సుముఖంగానే ఉన్నప్పటికీ పూర్తి స్థాయిలో మద్దతు చూపడం లేదు. ప్రస్తుతం కూడా మజ్లీస్ పార్టీ ఈ బిల్లును సమర్థించడం లేదని చెప్పడమే కాకుండా వ్యతిరేకంగా ఓటు వేసింది. దీనితో రెండు ఓట్లు మినహా పార్లమెంటులో అన్ని పార్టీలు మద్దతు ప్రకటించడంతో బిల్లు పాస్ అయ్యింది. బిల్లు మంజూరు కావడంతో ఇక చట్టసభల్లో మహిళల రిజర్వేషన్లు అ మలుచేయ డానికి అన్ని అడ్డంకులు తొలగిపోయాయి. అయితే నియోజకవర్గాల పునర్విభజన పూర్తి కాకపోవడం వల్ల 2024లో జరిగే పార్ల మెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో అమలుచేసే అవకాశం లేకుండా పోయింది. జనాభా లెక్కల ప్రక్రియ, ఆపై రాజ్యాంగ నిబంధనల ఆధారంగా నియోజ కవర్గాల పునర్విభజన ప్రక్రియ చేపట్టాల్సి ఉంటుంది. అయితే దీనికి సంబంధించి ఎటువంటి నిర్దిష్టమైన కాలపరిమితులుగాని, మార్గదర్శకాలు కాని లేవు. జనాభాలెక్కలు, డీలిమిటేషన్ తరువా త మహిళా బిల్లు అమలు జరుగుతుంది. స్వాతంత్ర్యం వచ్చాక 1952, 1962, 1972, 2002 సంవత్స రాల్లో కమిషన్‌ను ఏర్పా టుచేశారు. ఈ కమిషన్‌కు రాజ్యాంగం ద్వారా అనేక అధికారా లు, స్వయంప్రతిపత్తిని కల్పిం చారు. ఈ కమిషన్ తీసుకున్న ఏ నిర్ణయాన్ని కోర్టుల్లో సవాలు చేసే అవకా శం ఉండదు. ప్రతి రాష్ట్రా నికి దాని జనాభా నిష్పత్తి ప్రకారం లోక్‌సభ స్థానాలను నిర్ణయిస్తా రు. ప్రస్తుతం ఉన్న నియో జకవ ర్గాలు 2001 జనాభా లెక్కల ప్రకారం 2002లో ఏర్పాటు చేసిన కమిషన్ సూచనల మేరకు ఏర్పాటుచేశారు. 2021లో జనాభా గణన జరగలేదు. వెంటనే ఈ ప్రక్రియను అమలు చేయాలి. లేదంటే 2031లో అమలుచేయా ల్సి ఉంటుంది. పునర్వ్యవస్థీక రణ జరగకపోతే మహిళా బిల్లు అమలు అయ్యే అవకాశాలు ఉండవు. అయితే పూర్తిస్థాయి మెజా రిటీలో ఉన్న బిజెపీ ప్రభుత్వం ఈ అవరోధాలను అధిగమించి త్వరగా బిల్లును అమలు చేయ డానికి ప్రయత్నాలు ప్రారంభించింది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ



# 'జమిలి' గుబులు!

**ఇండియాలో 2014లో భారతీయ జనతాపార్టీ నాయకత్వంలోని నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ (ఎన్‌డిఏ) ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి దేశంలో పార్లమెంటు రాష్ట్రాల శాసనసభలైన చట్టసభలతో పాటు స్థానిక ప్రభుత్వాల ఎన్నికలు ఏకకాలంలో జరగాలని జమిలి ఎన్నికల ప్రస్తావన తెచ్చింది. ఈ విషయం బిజెపి తన మేనిఫెస్టోలో కూడా పెట్టింది.**

కవర్ స్టోరీ

బండారు రామ్మోహనరావు

బిజెపి మేనిఫెస్టోలో కాశ్మీర్లో 370 ఆర్టికల్ రద్దుతోపాటు ఏక పౌరసత్వ బిల్లు, ఒకే దేశం ఒకే చట్టం, ఇలాంటి అనేక అంశాలు తన మేనిఫేస్టోలో పెట్టింది. గత పదేళ్లుగా దేశంలో బిజెపి ఆధ్వర్యంలోని ఎన్డీఏ కూటమి రెండుసార్లు గెలిచి అధికారంలో ఉంది. పదేళ్లుగా నరేంద్రమోడీ ప్రధానమంత్రిగా ఉన్నారు. ఇలా ఒకటొకటిగా తాము మేనిఫెస్టోలో చేర్చిన అంశాలతో పాటు మ్యానిఫెస్టో లో చేర్చని పెద్ద నోట్ల రద్దు లాంటి అంశాలు అమలు చేస్తూ ప్రస్తుతం జమిలి ఎన్నికల మంత్రం పదేపదే జపిస్తున్నారు.

## పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల సస్పెన్స్ వీడింది

సెప్టెంబరు 18 నుంచి 22 వరకు ప్రత్యేక పార్లమెంట్ సమావే శాలు పెట్టింది. పాత పార్లమెంట్ భవనంలో మొదటిరోజు మొదలైన ఈ సమావేశాలు రెండవరోజు నుండి సెంట్రల్ విస్టా పేరు మీద ఇటీవల నిర్మించిన కొత్త పార్లమెంట్ భవనంలోకి చట్టసభలను మార్చి విజయవంతంగా సమావేశాలను నిర్వహిం చింది. ఇందులో మొదట్లో ఏఏ అంశాలు చర్చకు వస్తాయనే విషయం సస్పెన్స్‌గా ఉండిపోయింది. అనేక ఊహాగానాల మధ్య పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు మొదలై పూర్తి అయిపో యాయి. కాశ్మీర్లో 370 ఆర్టికల్ రద్దు నేపధ్యంలో రాష్ట్రాన్ని రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విడగొట్టిన సంగతి మన అందరికీ తెలుసు. మళ్లీ అందులో రాష్ట్రంలో శాంతిభద్ర తలు నెలకొన్న తర్వాత జమ్మూకాశ్మీర్‌కి రాష్ట్ర హోదా ఇస్తామని పార్లమెంట్ సాక్షిగా కేంద్ర ప్రభుత్వం ఎన్నోసార్లు చెప్పింది. అలాగే కేంద్ర ప్రభుత్వం ఈ కేసు సుప్రీం కోర్టులో ఉన్నందువల్ల సుప్రీం కోర్టులో కూడా కాశ్మీర్‌కు రాష్ట్రహోదా విషయంలో ఆఫిడవిట్ వేసింది. ఇక ఉమ్మడి పౌరసత్వ బిల్లు, మహిళా రిజర్వేషన్ బిల్లు, జమిలి ఎన్నికల ప్రస్తావన ఇవన్నీ ప్రత్యేకపార్లమెంట్ సమావేశా లలో చర్చకు వస్తాయని అందరూ ఊహించారు. అందరి ఊహాలను తలకిందులు చేస్తూ ఒకేఒక్క మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రతిపాదించి ఉభయసభ ల్లో ఆమోదింపచేసుకుంది. కొత్త పార్లమెంట్ భవనంలో ప్రతిపాదించిన తొలి బిల్లుగా అలాగే ఆమోదించిన తొలిచట్టంగా మహిళ రిజర్వేషన్ బిల్లు చరిత్రకి ఎక్కింది. అందరూ మహిళారిజర్వేషన్ల బిల్లు ప్రవేశపెట్టమని కోరడం ఇప్పటికే మూడు దశాబ్దాలకు పైగా దేశంలో ఈ చర్చ కొనసాగుతుం డడం మనకందరికీ తెలిసిందే కానీ ఇటీవల హైదరాబాదులో జరిగిన కాంగ్రెస్ పార్టీ సిడబ్ల్యుసి సమావేశంలో దమ్ముంటే పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ల బిల్లు ప్రవేశ పెట్టమని కేంద్ర ప్రభుత్వాన్ని కాంగ్రెస్‌పార్టీ డిమాండ్ చేసింది. అలాగే గత సంవత్సరం నుండి భారతీయ రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) కీలక నాయకురాలు కల్వకుంట్ల కవిత కూడా ప్రభు త్వాన్ని మహిళా రిజర్వేషన్ల గురించి ప్రశ్నిస్తూ డిమాండ్ చేస్తుంది. ఆ మధ్య ఈవిషయంపై ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద కూడా ఒక ధర్నా నిర్వహించింది. అలాగే దేశంలోని చాలా పార్టీలు మహిళా రిజర్వేషన్లు పెట్టమని కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తెస్తున్నాయి. ఇవన్నీ దృష్టిలో పెట్టుకొని ఎదుటివారి ఆయుధాన్ని లాక్కోవడంలో భారత ప్రధాని నరేంద్రమోడీ దిట్ట. అలాగే వారి ఆధ్వర్యంలో నడుస్తున్న బిజెపి తక్కువేమి తిన లేదు. అందరూ డిమాండ్ చేసిన తర్వాత మహిళా రిజర్వేషన్ల బిల్లు ప్రవేశపెట్టి ప్రతిపక్షాల చేతిలోని ఆయుధాలను లాక్కొని ప్రతిపక్షాలను నిరాయుధుల్ని చేసింది. 'రోగి కోరింది అదే వైద్యు డు ఇచ్చింది అదే' అనే సామెతను నిజం చేసింది. అలాగే జమిలి ఎన్నికల సమస్యను కూడా పార్లమెంటు ప్రత్యేక సమావేశాలకు ముందే ఒక పరిష్కారం చూపింది.

**జమిలి ఎన్నికల అమలు కోసం కమిటీ:** భారత మాజీ

రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆధ్వర్యంలో 8మంది సభ్యుల కమిటీ వేసి జమిలి ఎన్నికలకు తమ పార్టీ కట్టుబడి ఉందని ప్రకటించింది. అందులోని సాధ్యాసాధ్యాలను పరిశీలించడానికి ఈ కమిటీని వేశా మని ప్రభుత్వం ప్రకటించింది. ఈ కమిటీకి విధివిధానాలు నిర్ణయి స్తూ ఒక లేఖను కూడా జత చేసింది. జమిలి ఎన్నికలు నిర్వహిం చడానికి అవసరమైన రాజ్యాంగ సవరణలు ఏమి చేయాలి, వాటితో పాటు దేశంలో ఇప్పటికే ఎన్నికల విషయంలో ఉన్న ఇతర చట్టాల వల్ల వచ్చే అడ్డంకులు వీటిని అన్నిటినీ పరిశీలించి ఏ రకంగా జమిలి ఎన్నికలు నిర్వహించగలమని చట్టపరమైన సాంకేతికప రమైన మౌలికమైన సమస్యలను చర్చించి అవసరమైన పరిష్కారా లను సూచించమని ఆ కమిటీకి విధివిధానాలను సూచించింది. అవసరమైన సమయాన్ని తీసుకొని మరి ఈ కమిటీ అందరితో చర్చించి ఒక ఏకాభిప్రాయాన్ని సాధించాలని కూడా ప్రభుత్వం కమిటీకి సూచించింది. ఇప్పటికైతే ఆ కమిటీ పని మొదలు పెట్టింది. కానీ ఈ పని వేగంగా సాగడం లేదు. దానికి అవసర మైన మౌలిక వసతు లు కల్పన ఉద్యోగుల కేటాయింపు ఇలాంటివి కొంచెం ఆలస్యంగానే జరుగుతున్నాయి. అలాగని ఏ పని జరగడం లేదు అనలేం.



## జమిలి ఎన్నికలు అంటే ఏమిటి?

ఈ నేపథ్యంలో మనం జమిలి ఎన్నికలు అంటే ఏమిటి? మన భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన ప్పటి నుంచి ఎప్పుడైనా జరిగాయా? ప్రస్తుతం ఆ అవసరం ఎందుకు వచ్చింది? జమిలి ఎన్నికల నిర్వహణకు అవరోధాలు ఏమిటి వాటికి పరిష్కారం ఏమిటి అనే విషయాలు మాట్లాడుకుందాం.

1947లో భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. అప్పుడు భారత ప్రధానమంత్రిగా జవహర్‌లాల్‌నెహ్రూ ఆధ్వర్యంలో మంత్రివర్గం ఏర్పడింది. ఆ తర్వాత మన భారతదేశానికి రాజ్యాంగం రచించుకోవడానికి రాజ్యాంగ రచన సభ అప్పటి రాష్ట్రపతి బాబు రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పడింది. దానికి డ్రాఫ్టింగ్ కమిటీ చైర్మన్‌గా డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ నియమించబడ్డాడు. సుమారు 300 మంది సభ్యులు 11 కమిటీలు రెండు సంవత్సరాలకుపైగా ప్రస్తుత పాత పార్లమెంటు భవనంలో చర్చోపచర్చలు నిర్వహించి చివరికి 1949 నవంబరు 26వ తేదీ రాజ్యాంగాన్ని ఆమోదించింది. ఆ రోజును మనం ప్రస్తుతం రాజ్యాంగ దినోత్సవంగా జరుపుకుంటున్నాం. ఆ తర్వాత 26 జనవరి 1950 నుండి భారతదేశం సర్వసత్తాక భారతదేశంగా అవతరించింది. దాన్ని మనం గణతంత్ర దినోత్సవంగా జరుపుకుంటున్నాం. మన భారతరాజ్యాంగం ప్రకారం పంచాయితీ నుంచి పార్లమెంటు వరకు ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులచే ప్రాతినిధ్య ప్రజాస్వామ్యాన్ని పాటిస్తున్నాం. బ్రిటిష్ వారు మనకు అవశేషంగా మిగిల్చిన వెస్ట్ మినిస్టర్ పద్ధతి ప్రభుత్వాలను ఏర్పాటు చేసుకున్నాం. 1951 అక్టోబరు నుంచి 1952 వరకు దేశంలో మొదటి సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. అప్పుడు దేశంలో ఉన్న 14 రాష్ట్రాల శాసనసభలకు కేంద్ర పార్లమెంటుకు ఒకేసారి ఎన్నికలు జరిగాయి. అలా రెండుచోట్ల ఒకేసారి ఎన్నికలు జరిపిన పద్ధతిని జమిలి ఎన్నికలు అంటాం. యూనియన్ గవర్నమెంట్ స్టేట్ గవర్నమెంట్ ఈ రెండింటిని మన రాజ్యాంగంలో తీసుకు న్నారు. బ్రిటిష్ వారి హయాంలో ఉన్న స్థానిక ప్రభుత్వాల గురించి స్థానిక స్వపరిపాలన అని మన రాజ్యాంగంలో కేవలం ఆదేశిక సూత్రాలలో మాత్రం ప్రస్తావించారు. అప్పటికే మనదేశంలో పల్లవులు, చాణిక్యుల కాలంలో కూడా స్థానిక ప్రభుత్వాలు ఉన్నాయి. ఆ తర్వాత బ్రిటిష్ ప్రభుత్వంలో కూడా స్థానిక ప్రభుత్వాలు ఉన్నాయి. కానీ ఇప్పటి రూపంలో లేవు. భారత రాజ్యాంగం రాష్ట్రాల సమాహారంగా కేంద్ర ప్రభుత్వాన్ని యూని యన్ గవర్నమెంట్ అని పేర్కొంది. అలా మొదటిసారి సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. ఆ తర్వాత వరుసగా 1957, 1962, 1967 ఇలా మొదటి మూడు జమిలి ఎన్నికలు అప్పటి భారత ప్రధాని జవహర్‌లాల్‌నెహ్రూ హయాంలో జరిగాయి. 1964లో నెహ్రూ మరణం తర్వాత లాల్‌బహదూర్‌శాస్త్రి ప్రధానమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. ఆయన మరణంతో ఇందిరాగాంధీ ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో 1967లో కూడా జమిలి ఎన్నికలు జరిగాయి.

## భాషా ప్రయుక్త రాష్ట్రాలు– కాంగ్రెసేతర ప్రభుత్వాలు

ఇందులో మరొక విషయం చెప్పుకోవాలి. 1953లో భాషాప్రాయుక్త రాష్ట్రాల డిమాండ్‌తో మద్రాసు ఉమ్మడి రాష్ట్రం నుండి ఆంధ్ర రాష్ట్రం విడిపోయింది. ఆ తర్వాత 1956లో దేశవ్యాప్తంగా భాషాప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడ్డాయి. అందులో కేరళ రాష్ట్రం కూడా ఒకటి. 1957లో కేరళ రాష్ట్రంలో జరిగిన ఎన్నికలలో అక్కడి కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా సిపిఐపార్టీ గెలిచింది. కానీ ఆనాటి కాంగ్రెస్ పార్టీ పన్నిన కుట్రలు కుతంత్రాల వల్ల కేరళ రాష్ట్ర ప్రభుత్వం రద్దయింది. ఆ ప్రభుత్వాన్ని జవహర్‌లాల్ నెహ్రూ రాజ్యాంగంలోని 356 ఆర్టికల్ ఉపయోగించి దుర్మార్గంగా రద్దు చేశారు. అప్పటి నుండి కేరళ రాష్ట్రంలో ఉప ఎన్నికల పర్వ మొదలైంది. ఇక ఆ తర్వాత 1967లో దేశంలో తొమ్మిది రాష్ట్రాలలో కాంగ్రెసేతర ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. 1967లో ఇందిరాగాంధీ ఆధ్వర్యంలో ఎన్నికైన కేంద్ర ప్రభుత్వం 1972 వరకు అప్పటి పార్లమెంటుకు కాల పరిమితి ఉన్నాకూడా దాన్ని కన్నా ఒక సంవత్సరం ముందుగనే 1971లోనే పార్లమెంటును రద్ద చేసి మధ్యంతర ఎన్నికలకు వెళ్లింది. ఆ ఎన్నికల్లో ఇందిరాగాంధీ 'గరీబీ హటావో' అనే రాజకీయ నినాదంతో పాటు రాజాభరణాల రద్దు, బ్యాంకుల జాతీయకరణ, ఇలాంటి అనేక పరిపాలన సంస్కరణల అంశాలను తీసుకొని మళ్లీ అధికారంలోకి వచ్చింది. ఆ తర్వాత 1975లో దేశంలో ఎమర్జెన్సీ విధించడంతో 1976లో జరగాల్సిన పార్లమెంటు ఎన్నికలు మళ్లీ వాయిదా పడ్డాయి. ఆ తర్వాత 1977లో పార్లమెంటుకు ఎన్నికలు జరిగాయి. అప్పుడే దేశంలో మొట్టమొదటి కాంగ్రెసేతర జనతాపార్టీ ప్రభుత్వం మురార్జీదేశాయ్ ప్రధానమంత్రిగా ఏర్పడింది. ఇలా 1967 తర్వాత జరిగిన వివిధ రాజకీయ పరిణామాల మధ్యన కేంద్ర పార్లమెంటుకి రాష్ట్రాల శాసనసభలకు అప్పటిదాకా జరిగిన జమిలి ఎన్నికల పర్వం ముగిసింది.

## ప్రస్తుతం దేశంలో జమిలి ఎన్నికలు జరుగుతున్నాయా?

దేశంలోని అనేక రాష్ట్రాలు పార్లమెంటుకు కాకతాళీయంగా వస్తున్న

జమిలి ఎన్నికలు ఎన్నో ఉన్నాయి. ఉదాహరణకు 2004, 2009, 2014 వరకు మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పార్లమెంటుకు ఒకేసారి ఎన్నికలు జరిగాయి. ఇలా దేశంలోని చాలా రాష్ట్రాలు ఆయా సంవత్సరాలలో కలిసి ఎన్నికల నిర్వహించుకున్నాయి. కానీ 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2018లో తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు రాష్ట్ర శాసనసభను శాసనసభ కాలపరిమితి మరొక తొమ్మిది నెలల కాలం ఉండగానే రద్దుచేసి ముందస్తుగా ఎన్నికలకు కారణమయ్యారు. ఇలా జమిలి ఎన్నికల కథ మన తెలుగు రాష్ట్రాల్లో కూడా కొంత వరకు ముగిసినట్లే లెక్క. కానీ 2019లో విభజన ఆంధ్రప్రదేశ్‌కు మాత్రం మళ్లీ పార్లమెంటుకు ఆంధ్రప్రదేశ్ శాసనసభకు ఒకేసారి ఎన్నికలు జరిగాయి. అలాగే పక్క రాష్ట్రమైన ఒరిస్సాతో పాటు మరొక ఐదు ఆరు రాష్ట్రాలకు జమిలి ఎన్నికలు జరిగాయి. ప్రస్తుతం పార్లమెంటుతో పాటు ఆ రాష్ట్రాలలో జమిలి ఎన్నికలే జరుగుతున్నాయి.

దేశ పార్లమెంటుకు మధ్యంతర ఎన్నికలు రావడం రాష్ట్రాల శాసనసభలకు కూడా అప్పుడప్పుడు మధ్యంతర ఎన్నికలు రావడంతో ఈ జమిలి ఎన్నికల పర్వం దేశంలో చాలావరకు ముగిసింది. ఈ నేపథ్యంలో ప్రతి సంవత్సరం ఏదో ఒక రాష్ట్రంలో ఎన్నికలు జరగడం అట్లాగే పార్లమెం టుకు మరొకసారి జరగడం దీంతో ప్రతి సంవత్సరం ఎన్నికల నామ సంవత్స రంగానే మిగిలిపోతుంది. దాంతో దేశంలోని ఏదో ఒక రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలు కావడం అక్కడ అభివృద్ధి పనులు నిలిచిపోవడంతో పాటు ఎన్నికల ప్రక్రియ సుదీర్ఘంగా సాగే అవసరం కలిగింది. ఏదైనా కఠిన నిర్ణయం తీసుకోవాలంటే ప్రభుత్వాలకు ఈ ఎన్నికలు అవరో ధంగా మారాయి. దీన్ని గమనించిన మోడీ ప్రభుత్వం దేశంలో ఒకే దేశం ఒకే ఎన్నిక అనే నినాదంతో జమిలి ఎన్నికలకు తరలింది. కేవలం పార్లమెంటు రాష్ట్ర శాసనసభలకే కాకుండా స్థానిక ప్రభు త్వాలైన పంచాయితీ, మండలం, లేక మధ్యంతర వ్యవస్థ పంచాయితీ బ్లాక్ లాంటివాటితో పాటు జిల్లా పరిషత్‌ల వరకు ఒకేసారి ఎన్నికలు జరిగితే బాగుంటుందని ఆలోచన చేసిం ది. అసలు చిక్కులు ఇక్కడే మొదలయ్యాయి.



దేశంలో రాష్ట్రాల శాసనసభలతో సహా ఎన్నికలు జరపాలంటే మొదట అన్ని రాష్ట్రాల శాసనసభలు రద్దు కావాలి. లేకపోతే ఆయా రాష్ట్రాల శాసనసభ ఎన్నికలను ముందుకో వెనకకో జరిపి జమిలి ఎన్నికలు తీసుకురావాలి. ఇది ప్రస్తుతం ఉన్న మన రాజ్యాంగం ప్రకారం అసాధ్యం. ఇప్పుడైతే ప్రతి సంవత్సర నాలుగైదు రాష్ట్రాల ఎన్నికలు వేరువేరు తేదీలలో వేరువేరు నెలల లో జరుగుతున్నాయి. సంవత్సరం అంతా ఎక్కడో ఎన్నికల సంద డి ఎన్నికల కోలాహలం ఉంటూనే ఉంది. కనుక రాష్ట్ర శాసన సభలను ముందస్తుగా రద్దు చేస్తే ఆయా ప్రభుత్వాలు చూస్తూ ఊరుకోవు. కోర్టులకు వెళ్లి స్టే తెచ్చుకుంటాయి. దీంతో మరొక రాజ్యాంగ సంక్షోభం ఏర్పడుతుంది. ఎందుకంటే ప్రస్తుతం దేశంలో 14 రాష్ట్రాలలో బిజెపి దాని మిత్రపక్షాల అధికారంలో ఉంటే మరొక జాతీయ పార్టీ కాంగ్రెస్ నాలుగు రాష్ట్రాల్లో అధికారంలో ఉంది. మరొక జాతీయ పార్టీ అయిన ఆమ్ ఆద్మీ పార్టీ ఢిల్లీ, పంజాబ్ రాష్ట్రాలలో అధికారంలో ఉంది. ఇక దేశంలో మిగిలిన 9 తొమ్మిది రాష్ట్రాలలో వేరువేరు ప్రాంతీయ పార్టీలు అధి కారంలో ఉన్నాయి. ఈ స్థితిలో ప్రస్తుతం భారత ప్రభుత్వం చేసిన జమిలి ఎన్నికల ప్రతిపాదన ఇన్ని వైరుధ్యాల మధ్య సాధ్యమవుతుందా అనేది మొదటి ప్రశ్న.

## జమిలి ఎన్నికలే ఎందుకు? కేంద్ర ప్రభుత్వం చేస్తున్న వాదనలు ఏమిటి?

ఇక జమిలి ఎన్నికలకు అనుకూలంగా వాదిస్తున్న కేంద్ర ప్రభుత్వం చెప్పే మొదటి కారణం దేశమంతా ఒకేసారి ఎన్నికలు జరిగితే ఎన్నికల కోడ్ ఒకేసారి ఉంటుంది. అభివృద్ధి పథకాలు పనులు నిలిపివేయడం జరగదనేది మొదటి కారణం. ఇక ప్రభుత్వం చెప్పే రెండవ కారణం ఎన్నికల ఖర్చు మిగులుతుంది, అనేది ఎన్నికలు ఎప్పుడు జరిపిన ఖర్చు జరుగుతుంది. కానీ బావిలో నీళ్లు తోడడానికి 'కడవకు అయినా చేంతాడే ముంతకు అయినా చేంతాడే' అని తెలుగులో ఒక సామెత చెప్పినట్లు ప్రతి ఎన్నికలకు వేరువేరుగా ఖర్చు చేసే బదులు ఒకేసారి ఎన్నికలు పెడితే ఎన్నికల సిబ్బంది, పోలింగ్ బూతుల ఏర్పాటు ఇవన్నీ కూడా రెండు మూడు సార్లు ఎన్నికలు జరిగిన దానికంటే ఖర్చు తక్కువ వస్తుందనేది ప్రభుత్వ వాదన. ఇందులో ఎవరి వాదన వారికి ఉన్నా కూడా ఇది సరైన వాదన అనిపించదు.

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యమైన మనదేశంలో ప్రజాస్వామ్యం మరింత పరిడవిల్లడానికి ఎన్నికల ఖర్చును ఒక సాకుగా చూపించడం సరికాదనేది ఒక వాదన. ఎందుకంటే మన భారతదేశ వార్షిక బడ్జెట్ సుమారు 45 లక్షల కోట్లు అందులో 0.5శాతం మాత్రమే. దేశంలో జరిగే అన్ని ఎన్నికల ఖర్చు అవుతుంది. అలాంటప్పుడు ఎన్నికల ఖర్చు అనే ఈ వాదన ఈ ఖర్చు ముందు వీగిపోతుంది. ఇక రెండవ వాదన ఒకేదేశం ఒకే ఎన్నిక. కానీ మన భారతదేశం యూనిటరీ, ఫెడరల్ వ్యవస్థ కలిగిన దేశం. దానికితోడు 73వ 74వ రాజ్యాంగ సవరణల ద్వారా 1992లో అప్పటి ప్రధానమంత్రి పీవీ నరసింహారావు హయాంలో పంచాయితీలు, మున్సిపాలిటీల్లో ఎన్నికల నిర్వహణకు రాజ్యాంగ సవరణ జరిగింది. దానికితోడు పార్లమెంటు అసెంబ్లీ శాసనసభకు సమానంగా స్థానిక ప్రభుత్వాలకు విధులు, నిధులు అధికారాలు రాజ్యాంగబద్ధంగా కేటాయించారు. ఆ చట్ట ప్రకారం 29 అధికారాలు, అంశాలు మూడంచెల పంచాయితీ ప్రభుత్వాలకు 18 అంశాలు మున్సిపాలిటీలు కార్పొరేషన్‌లకు దాఖలు కాబడ్డాయి. అప్పటి నుండి దేశంలో పంచాయితీస్థాయిలో మొదటి అంచె గ్రామ పంచాయితీ నుండి మండల లేక మధ్యస్థాయి అంచే రెండవ ప్రభుత్వంగా జిల్లా పరిషత్ మూడవ అంచెగా స్థానిక పభుత్వాలుగా మూడించల పంచాయితీ పాలన మొదలైంది.

– ప్రస్తుతం నరేంద్రమోడీ ప్రభుత్వం కేంద్ర పార్లమెంటు రాష్ట్రాల శాసనసభలు పంచాయితీలు మున్సిపాలిటీలలో ఉన్న ప్రభుత్వాలను కలుపుకొని ఈ మూడంచెల ప్రభుత్వాలకు ఎన్నికల జరపడానికి జమిలి ఎన్నికల విధానాన్ని ప్రతిపాదించింది. ఈ విధానం చూడడానికి పైకి బాగానే కనిపిస్తున్నా ఇందులో ఉన్న సాధ్యాసాధ్యాల గురించి మనం చర్చిద్దాం.

## 'వెస్ట్ మినిస్టర్ సిస్టం'లో జమిలి ఎన్నికలు సాధ్యమవుతాయా?

మనది పార్లమెంటరీ ప్రజాస్వామ్య పద్ధతిలో వెస్ట్ మినిస్టర్ పద్ధతి అని ఇంతకు ముందే చెప్పుకున్నాం. మన పార్లమెంట్‌లోని ఎగువ సభగా చెప్పుకునే రాజ్యసభ పెద్దల సభగా పరిగణించబడుతుంది. అది శాశ్వత సభ. ఇక దిగువ సభగా చెప్పుకునే లోక్‌సభ దేశంలో అన్ని ప్రాంతాల నుండి రాష్ట్రాల నుండి ప్రస్తుతం 543 మంది పార్లమెంటు సభ్యులతో కూడిన ప్రత్యక్ష ప్రజాస్వామ్య ప్రాతినిధ్య సభగా చెప్పుకోవచ్చు. దేశంలో రాజ్యసభ లాగానే కొన్ని కొన్ని రాష్ట్రాలలో శాసనమండలి అనే శాశ్వత సభలు కూడా ఉన్నాయి. అలాగే రాష్ట్రాల శాసనసభలు దేశంలోని లోక్‌సభ లాగా ప్రజలు ప్రత్యక్షంగా ఎంపీలను ఎన్నుకున్నట్లే రాష్ట్రాలలో ప్రత్యక్షంగా ప్రజలు ఓటు వేసి ఎమ్మెల్యేలనే ఎన్నుకుంటారు. పార్లమెంటులో ఎంపీల మెజార్టీని బట్టి సగం కంటే ఎక్కువ వచ్చిన పార్టీ అధికారంలోకి వస్తుంది. వారు ప్రధానమంత్రి ఆధ్వర్యంలో మంత్రి వర్గాన్ని ఏర్పాటు చేసుకుంటారు. అలాగే రాష్ట్ర శాసనసభలో కూడా అత్యధిక ఎమ్మెల్యేలు గెలిచిన పార్టీ శాసనసభలో 50 శాతం కంటే ఎక్కువ శాసనసభ్యులను ఎన్నుకొని మెజార్టీ సాధిస్తే ఆ పార్టీ ప్రభుత్వం ఏర్పరుస్తుంది. ఇలా వెస్ట్ మినిస్టర్ పద్ధతిలో నడుస్తున్న




ప్రభుత్వాలు ఎప్పుడైనా ప్రధానమంత్రితో పాటు క్యాబినెట్ రాజీనామా చేస్తే ప్రభుత్వం పడిపోతుంది. అలాగే ప్రధానమంత్రి తన మెజార్టీ సభ్యులతో కూడి మంత్రివర్గం తీర్మానం చేసి



పార్లమెంటును అర్ధాంతరంగా రద్దు చేయవచ్చు. లేక ప్రభుత్వం ఏర్పాటు చేసిన పార్టీ తన సభ్యుల విశ్వాసం కోల్పోయి ప్రభుత్వమే పడిపోవచ్చు. ఇలా దేశంలో పార్లమెంటులో, రాష్ట్రాలలో శాసనసభలలో ఎక్కడ జరిగినా ఆయా ప్రభుత్వాలు పడిపోతాయి, లేక రద్దు అవుతాయి. అలాగే కేంద్ర ప్రభుత్వం దగ్గర ఉన్న మరొక అధికారం ఏమిటంటే రాజ్యాంగంలోని 356 ఆర్టికల్ ఉపయోగించి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలను సరైన కారణాలు చూపించి రద్దు చేయవచ్చు. కేరళ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆనాటి జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వం రద్దు చేసినట్లు ఇదివరకే చెప్పుకున్నాం. అలా ఆయా కారణాలతో పార్లమెంటు రద్దయినప్పుడు లేక రాష్ట్రాల శాసనసభలు రద్దు అయినప్పుడు ప్రభుత్వాలు పడిపో తాయి. అప్పుడు మళ్లీ మధ్యంతర ఎన్నికలు వస్తాయి కదా! దీనికి జమిలి ఎన్నికలలో సరైన పరిష్కారం లేదు. అంటే ఒకసారి జమిలి ఎన్నికల కోసం 10 నుండి 15 సంవత్సరాలు కష్టపడి దేశమంతా రాష్ట్రాల శాసనసభలకు, పార్లమెంటుకు పంచాయితీలకు ఒకేసారి ఎన్నికలు జరిపిస్తే నేను చెప్పిన పై కారణాల వల్ల ఆ ప్రభుత్వాలు పడిపోతే మళ్లీ మధ్యలో ఎన్నికలు వచ్చిపడతాయి. ఇంకా చేస్తే పై కారణాలతో జమిలి ఎన్నికల ప్రయాస మొత్తం కుప్పకూలిపోతుంది. అప్పుడు ఈ ప్రక్రియ అంతా బూడిదలో పోసిన పన్నీరే అవుతుంది. కనుక జమిలి ఎన్నికలు ప్రస్తుతం ఉన్న రాజ్యాంగం ప్రకారం సాధ్యం కాదు. కానీ రాజ్యాంగంలో ఒక ఐదు సవరణలు తీసుకువచ్చి కర్రసాము, కత్తిసాము చేస్తే సాధ్యమవుతుంది. ఈ సాము గరిడీల కోసమే ప్రభుత్వం భారత

మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆధ్వర్యంలో ఒక కమిటీ వేసింది. అలా వేసిన కమిటీకి జమిలి ఎన్నికలు ఎలా సాధ్యమవుతాయో పరిష్కారం కనుగొనమని అడిగింది. అలాగే ప్రస్తుత పంచాయతీరాజ్ వ్యవస్థలో గ్రామ సర్పంచ్‌కు ప్రత్యక్ష ఎన్నిక ఉన్నా మండల, జిల్లా పరిషత్ అధ్యక్షులను ఎన్నుకోవడానికి పరోక్ష ఎన్నికలే ఉన్నాయి. కనుక ఇక్కడ కూడా రాష్ట్ర అసెంబ్లీల్లో పార్లమెంటులో ఏ సమస్య వస్తుందో అదే సమస్య వస్తుంది. ఇలాంటి క్లిష్ట పరిస్థి తులలో ఒకే దేశం ఒకే ఎన్నిక ఎలా సాధ్యమవుతుందనేది మిలియన్ డాలర్ల ప్రశ్న.

## అమెరికాలో జమిలి ఎన్నికలు జరుగుతున్నాయా?

అమెరికాలో అధ్యక్ష తరహా పాలన అమల్లో ఉంది కనుక అక్కడ ఒకేసారి ఎన్నికలు ప్రతి రెండేళ్లకోసారి జరుగుతున్నాయి. అక్కడ అధ్యక్ష ఎన్నిక ఒకసారి జరుగుతుంది. అలాగే రాష్ట్రాల శాసన సభలకు, స్థానిక ప్రభుత్వాలకు ఒకేసారి ఎన్నికలు జరుగుతాయి. దేశ కాంగ్రెస్ పార్లమెంట్‌తో సమానం. అట్లాగే మన రాజ్యసభ లాంటి శాశ్వత సభ సెనేట్‌కి ఒకసారి మొత్తం ప్రతి రెండేళ్లకో సారి ఎన్నికల ప్రక్రియ ముగుస్తుంది. అధ్యక్ష తరహా పాలన ఉన్న అమెరికా లోనే ప్రతి రెండేళ్లకు ఒకసారి ఎన్నికలు జరుగుతున్నప్పుడు మన దేశంలో ప్రస్తుతం అమల్లో ఉన్న వెస్ట్ మినిస్టర్ పద్ధతిలో ఈ ఎన్నికలు సాధ్యం కావు. ఒకవేళ రామ్‌నాథ్ కోవింద్‌కు సలహాలు, సూచనలు ఇచ్చి అనేక రాజ్యాంగ సవరణలు చేసినా జమిలి ఎన్నికలు ప్రవేశపెడితే 'కొండను తవ్వి ఎలుకను పట్టినట్లు' గానే అవు తుంది. దీనికి సరైన పరిష్కారం జమిలి ఎన్నికలలో లేదు.


## ఒకే దేశం ఒకే ఎన్నిక ఎజెండా సాధ్యమవుతుందా?

అలాగే మరొక సమస్య ఉత్పన్నం



అవుతుంది. ప్రస్తుతం స్థానిక ప్రభుత్వాలకు ఒకసారి, రాష్ట్ర ప్రభుత్వాలకు ఒకసారి, దేశ పార్లమెంట్‌కి ఒకసారి ఎన్నికలు జరుగుతు న్నందున ఆయా స్థాయిల్లో ప్రజలు తమ అవసరాల నిమిత్తం ఎక్కడికక్కడ ఆ ఎన్ని కలలో ఎజెండా ఎంచుకుంటారు. పార్టీలు ఎన్నికల సమయంలో ప్రజల దగ్గరికి ఎన్నికల ప్రచారానికి వెళ్లినప్పుడు స్థానిక ప్రభుత్వాలలో గ్రామ, మండల, జిల్లా స్థాయి సమస్యలు ప్రస్తావనకు వస్తాయి. అలాగే రాష్ట్ర అసెంబ్లీ సభ్యులను ఎన్నుకున్నప్పుడు రాష్ట్రానికి సంబంధించిన అంశాలు ఎన్నికల ప్రచారంలో చర్చకు వస్తాయి. అలాగే దేశంలో ఎన్నికలకు దేశంలో పరిస్థితులు, సమస్యలు చర్చకు వస్తాయి. వీటిని అనుసరించి పార్టీలు తమ మేనిఫెస్టోలో వాటిని ప్రకటిస్తాయి. అప్పుడు ప్రజలకు స్థానిక ప్రభుత్వాన్ని, దేశ ప్రభుత్వాన్ని ఎన్నుకునే విషయంలో ఛాయిస్ వేరుగా ఉంటుంది.

కానీ ఒకే దేశం ఒకే ఎన్నిక అన్నప్పుడు దేశంలోని సమస్యలన్నింటినీ గ్రామంలో, గ్రామంలోని సమస్యలు అన్నిటిని దేశంలో ప్రస్తావించడం సాధ్యం కాదు. ఒక్క మాటలో చెప్పాలంటే 'గల్లీలోని సమస్యలు ఢిల్లీలో, ఢిల్లీలోని సమస్యలు గల్లీలో ప్రస్తావించడం వీలు కాదు, అవసరం కూడా లేదు. ఒకవేళ ప్రస్తావించినా కూడా అది హాస్యాస్పదంగా ఉంటుంది.




కనుక ప్రజల ఎంపికను ఒకే దేశం ఒకే ఎన్నిక నియంత్రిస్తుంది. అందుకే జమిలి ఎన్నికలు సాధ్యం కాదనే ఒక వాదన వినిపిస్తుంది".

## జమిలి ఎన్నికలు సాధ్యం కావాలంటే ఏం చేయాలి?

జమిలి ఎన్నికలు సాధ్యం కావాలంటే పరిష్కారాలు ఏమిటి? అని కూడా ఆలోచించాలి. ఉదాహరణకు ఆయా రాష్ట్రాలలో స్థానిక ప్రభుత్వాలు మూడంచెల ప్రభుత్వాలకు ఎన్నికలు ఒకేసారి జరపవచ్చు. గతంలో ఎన్టీ రామారావు గారు ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉండగా పంచాయతీ సర్పంచ్ నుండి మండల, జిల్లా పరిషత్ అధ్యక్షుల వరకు మున్సిపల్ ఛైర్‌పర్సన్ నుండి కార్పొరేషన్ మేయర్ వరకు ప్రత్యక్ష ఎన్నికలు జరిపించారు. పంచాయతీ మూడంచెల వ్యవస్థకు ఒకసారి మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు మరొకసారి ఎన్నికలు జరిపి ఆయా స్థాయిల్లో ప్రత్యక్ష ప్రజాస్వామ్యాన్ని ప్రవేశపెట్టారు. అప్పుడు అవిశ్వాస తీర్మానాలు లేవు. ప్రభుత్వాలు పడిపోవడం అంతకంటే లేదు. ప్రస్తుతం మన తెలుగు రాష్ట్రాలలో స్థానిక ప్రభుత్వాల స్థాయిలో ఒక సర్పంచ్‌కి తప్ప మండల జిల్లా పరిషత్ అధ్యక్షులకు, మున్సిపల్ ఛైర్ పర్సన్లు, మేయర్లకు ప్రత్యక్ష ఎన్నికలు లేవు. పరోక్షంగా ఎన్నుకుంటున్నారు. మరి ఎన్టీ రామారావు గారు ఆనాడు చేసిన ఎన్నికల ప్రక్రియ చేపడితే స్థానిక ప్రభుత్వాలలో అవిశ్వాస తీర్మానాలు అసలే ఉండవు. స్థానిక ప్రభుత్వాల స్థాయిల్లో ఎన్నికలు అన్ని ఒకేసారి జరపడానికి వీలుంది.

ముఖ్యమంత్రులకు ప్రత్యక్ష ఎన్నిక

ఇక రాష్ట్రాల శాసన సభలు, పార్లమెంటు ఎన్నికలు ఒకేసారి జరపాలంటే రాష్ట్రాల శాసన సభలు పార్లమెంటును శాశ్వత సభలుగా ప్రకటించాలి. ఇప్పటి వెస్ట్ మినిస్టర్ సిస్టంలో ఇది సాధ్యం కాదు. కానీ రాష్ట్రాల ముఖ్యమంత్రులను ప్రత్యక్షంగా ఎన్నుకుంటే అప్పుడు ప్రభుత్వం పడిపోవడం అంటూ ఉండదు. గతంలో పంచాయతీరాజ్ వ్యవస్థలో ఎలా ప్రత్యక్ష ఎన్నికలు ప్రవేశపెట్టారో అలాగే రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ప్రత్యక్ష ఎన్నికలు ప్రవేశపెట్టాలి. శాసనసభలకు ఎమ్మెల్యేలు ఎన్నిక అవుతారు కానీ వారికి ముఖ్యమంత్రులు ఎన్నుకునే అవకాశం ఉండదు. ముఖ్యమంత్రిని ప్రజలే ప్రత్యక్షంగా ఎన్నుకుంటారు కనుక ఆ అవసరం కలగదు. ఇక అప్పుడు శాసనసభలు శాశ్వత సభలుగా ఉంటాయి. ప్రజోపకరమైన చట్టాలు చేస్తూ ముఖ్యమంత్రి ప్రతిపాదించే ప్రజా వ్యతిరేక చేసే చట్టాలను శాసనసభ ద్వారా తిప్పి కొడతారు. ఉదాహరణకు అమెరికాలో అధ్యక్ష తరహా పాలన ఉన్నా కూడా అక్కడ అమెరికా అధ్యక్షుడు ప్రతిపాదించిన అన్ని అంశాలు కాంగ్రెస్ అట్లాగే సెనేట్లో తప్పనిసరిగా పాస్ కావాలని రూలు ఏమీ లేదు. ఒక దశలో అమెరికా అధ్యక్షుడికి వ్యతిరేకంగా దేశంలోని ఉద్యోగస్తుల జీతాలు అన్ని అమెరికన్ కాంగ్రెస్‌లో పాస్ కాకుండా ఆపగలిగారు. అలా ముఖ్యమంత్రి ఇష్టారాజ్యంగా పాలన చేయకుండా మన రాష్ట్రాల శాసనసభలకు ఆ అధికారం ఉంటుంది. అప్పుడు రాష్ట్రాల శాసన సభలు పడిపోవడం ఉండదు కనుక రాష్ట్రాలలో మధ్యంతర ఎన్నికలు వచ్చే అవకాశం లేదు. ఈ ప్రయోగాన్ని దేశ వ్యాప్తంగా ప్రధానమంత్రిని కూడా ప్రత్యక్షంగా ఎన్నుకొని చేయవచ్చునా అనే ఒక ప్రశ్న ఉత్పన్నమవుతుంది. అది చాలా కష్టం. పెద్ద రాష్ట్రాలలో ఇప్పటికే ప్రాంతాల సమస్య ఉంది. ఏ ప్రాంతంవాడు ముఖ్యమంత్రి అయ్యాడు, ఏ ప్రాంతానికి అన్యాయం జరిగింది.. ఇలాంటి సమస్యలు ముందుకొస్తున్నదానికి మన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మంచి ఉదాహరణ. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విడిపోయిన తర్వాత ఈ సమస్య లేకుండా ఉందా అంటే అదీ లేదు. విభజిత ఆంధ్రప్రదేశ్‌లో రాయలసీమ, ఆంధ్ర, ఉత్తరాంధ్ర సమస్యలు ఉండనే ఉన్నాయి. కానీ దేశంలోని చాలా రాష్ట్రాలలో ఈ సమస్యలు లేవు. ముఖ్యమంత్రిని ప్రత్యక్షంగా ఎన్నుకున్నంత సులభంగా దేశ ప్రధాని ప్రత్యక్షంగా ఎన్నుకోలేం. ఎందుకంటే అక్కడ భాష, ప్రాంతం, కులం, భౌగోళిక పరిస్థితులు దీనికి అడ్డుగా నిలుస్తాయి.

**(మిగతా 19వ పేజీలో)**

విదేశాలలో చదవడం అనేసరికి మనకి అమెరికా లండన్ ఆస్ట్రేలియా వంటి నగరాల పేర్లు గుర్తుకు వస్తాయి. కారణం భాష విషయంలో ఇంగ్లీష్ వాడకం ఉంది. ఎప్పటి నుండో ఈ దేశాలతో మనకి అన్ని రకాలుగా సంబంధాలు ఉన్నాయ్. మరి జపాన్ కొరియా తైవాన్ వంటి నగరాలలో మన పిల్లలు చదవడానికి వీలు ఉందా అనే విషయాలను తెలుసుకుందాం.



# జపాన్, కొరియాలో ఉన్నత విద్య



ఈ దేశాలలో ఆంగ్లమాధ్యమం లేదు అనే అపోహ మనలో చాలామందికి ఉంది. దీనికి కారణం ఈ దేశాలలో ఆంగ్లంలో వార్తవినిమయం లేదు. యూరోప్ దేశాలలో వలె లేదా అమెరికాలో ఆంగ్లం జనబాహుళ్యంలో చాలా బాగా వాడుకలో ఉంది. అందువలన మన విద్యార్థులు జపాన్ వంటి దేశాలకి చదవడానికి వెళ్లడం తక్కువ కానీ జపాన్ దక్షిణ కొరియా తైవాన్ దేశాలలో ఆంగ్ల మాధ్యమంలో విద్యని మనం అభ్యసించవచ్చు. ఇక్కడి విశ్వవిద్యాలయాలు టాప్ రాంక్‌లో ఉన్నాయి. జపాన్‌దేశంలో ఆంగ్లం జనబాహుళ్యం మధ్యలో అంతగా వాడుకలో లేకపోయినా బోధనాపరంగా ఆంగ్లం వాడుతున్నారు. అందుకే ఇక్కడి విశ్వవిద్యాలయాలు శాస్త్రసాంకేతికపరంగా ముందున్నది. జపాన్ భౌగోళికంగా, జీవనవిధానం, ఆహారం అన్ని వ్యత్యాసమే. పైగా అగ్నిపర్వతాల సమాహారం. యూనివర్సిటీ ఆఫ్ టోక్యో 23వ ర్యాంకు, క్యోటో యూనివర్సిటీ 36వ ర్యాంకు, టోక్యో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ 55వ ర్యాంకుతో ప్రపంచంలో పేరు పొంది ఉన్నాయ్. ఇంకా ఒసాకా యూనివర్సిటీలలో రోబోటిక్ శాస్త్ర పరిశీలనకు పేరు పొందాయి. జపాన్ దేశం శాస్త్రసాంకేతిక పరిశీలనకు ప్రపంచంతో పోటీపడుతోంది. మనదేశంతో జపాన్ చాలాకాలంగా అన్ని రంగాలలో సహకరిస్తూ ముందుకు పోతోంది. అందువలన ఆంగ్లం భాష



ఇక్కడ వ్యవహారికంగా లేదు. ఈ అపోహతో ఉన్నత చదువుల కోసం వెళ్లకుండా ఉండొద్దు. మరొక విషయం పార్ట్‌టైం ఉద్యోగాలు జపాన్‌లో చేయడం కొంచెం కష్టం ఇది గమనించాలి.

దక్షిణ కొరియా దీని రాజధాని సియోల్. ఇక్కడ ఇంగ్లీష్ వ్యవహారిక భాష. వాడుక తక్కువ కానీ బోధనాభాషగా ఆంగ్లం ఉంది. దక్షిణ కొరియా జీవన రీతి, ఆహారం మనకి అలవాటు పడడం కొంత సమయం పట్టవచ్చు. ఇక్కడి విశ్వవిద్యాలయాలు ప్రపంచంలో టాప్‌రాంక్‌లో ఉంది. సియోల్ నేషనల్ యూనివర్సిటీ 29వ ర్యాంకు, కొరియా అడ్వాన్స్డ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సు అండ్ టెక్నాలజీ 42వ రాంక్, కొరియా యూనివర్సిటీ 74వ ర్యాంక్ పొంది ఉన్నాయి.

తైవాన్‌రిపబ్లిక్ ఆఫ్ చైనా భాగం అయి ఉంది. ఆర్థికంగా తైవాన్ మంచి పటిష్టంగా ఉంది. విద్య ఇంకా శాస్త్రసాంకేతిక పరంగా ప్రపంచంతో పోటీపడుతోంది. ఎలక్ట్రానిక్స్ ఎగుమతుల పరంగా ఈ దేశం ముందుంది.

పైగా చెప్పిన సమయంలో అనుకున్న టార్గెట్ అందుకుంటారని పేరు ఉంది. తైవాన్‌లో విద్య నేర్చుకోవడం ఎంతో మంచిది అనే భావం ఉంది. ఇక్కడి యూనివర్సిటీలు ఎంతో పేరు పొందాయి. జపాన్, దక్షిణ కొరియా, తైవాన్ దేశాలలో మన విద్యార్థులు ఉన్నత చదువులకు ఎటువంటి సందేహాలు లేకుండా వెళ్లవచ్చు. మన దేశంతో ఈ మూడుదేశాలు అన్ని రంగాలలో కలిసి పనిచేస్తున్నాయి.

**- ఈ.ఎస్.మాధవన్**

## ఈవారం కవిత్వం



# చెట్లు మాట్లాడుతున్నాయి

**మల్లెలు,** మందారాలు రాలిపోతున్నాయి
చామంతి, గులాబి వాడిపోతున్నాయి
సపోటాలు, జామలు పండ్లై కింద పడుతున్నాయి
తమలపాకులు, కరివేపాకు రెమ్మలు
ముదిరిపోతున్నాయి
ఆ చెట్లన్నీ మాట్లాడుకుంటున్నాయి
రోజూ మనల్ని తెంచిపెట్టే ఆమె ఎక్కడికెళ్లిందని.
వేంకటేశ్వర గుడిలో పూలెన్ని తక్కువయ్యాయోనని
మల్లెలు, మందారాలు బాధపడుతున్నాయి
సూర్య నమస్కారాలు చేసినట్లు
రోజూ పూజించే ఆమె ఇంకా రాలేదని
తులసిమొక్క తానే ప్రదక్షిణలు చేసుకుంటుంది.
మూలనున్న ఈతపొరుక, కొబ్బరిపొరుక
పనిలేక బద్దకానికి అలవాటు పడ్డట్లు నిద్రిస్తున్నాయి.
కుండీలలో పెరుగుతున్న తెల్ల చామంతి మొక్కలు
ముసురుపట్టిన చినుకులను ముద్దాడుతున్నాయి
తనువంతా ఆనందపడుతూ గుత్తుగా పెరుగుతున్నాయి
నేలరాలిన మల్లెలు మందారాలు/ వాన నీళ్లతో
మాట్లాడుతున్నాయి
పూజకు నోచుకోలేకపోయామని
మీతో కలిసి ప్రయాణిస్తామని
ఇప్పుడు నీటికి పూలు తోడైనాయి
పూల వాసనలతో మోరికాలువ సుగంధమై
పారుతున్నది.
నీళ్లతో కలవని పూలన్నీ
నా చేతిలోని ఈతపొరకతో కలుస్తున్నాయి
చెత్తకుండీలోకి తోస్తున్న నా చేతులు పట్టుకొని
అడుగుతున్నాయి పూజకు వెళ్లే భాగ్యం లేదా అని.
రోజూ పూజకోసం పూలనిచ్చే ఆ చెట్లు
నన్ను అడుగుతున్నాయి..
ఓనరమ్మ ఎప్పుడొస్తదని...
సాయంత్రం కాసేపు మాట్లాడే ఓనరమ్మవలె
ఇప్పుడు ఆ చెట్లే నాతో మాట్లాడుతున్నాయి.

**- ఎజ్జు మల్లయ్య**

---




# అమరజ్యోతి

నీలోని చైతన్యమే
నిన్ను వెలిగించే చమురు
చీకట్లను చీల్చడానికి
కళ్లల్లో వొత్తులేసుకో..
అక్కడ చూడు/ తిమిరాన్ని ఛేధిస్తూ
దివ్వెల మహోజ్వల కాంతులు
హృదయం వెలుగు రెక్కలతో
విచ్చుకోవడమంటే
కొన్ని దీపాల్ని
నీలో వెలిగించుకోవడమే.
దీపాల్ని దాటి వెళ్లకు
ధరించి వెళ్లు
నీలో వెలిగించుకుని వెళ్లు
నీ వెలుగుల్ని మింగే
అసూయ గాలులుంటాయి
కాస్త అప్రమత్తంగా వుండు
నీలోని జ్వాలను
అమరజ్యోతిని చేసేందుకు
కాసింత చేయూతనివ్వు
నిన్ను బతుకంతా
వెలుగుల్తో నింపుతుంది.

**- డాక్టర్ కటుకోఝ్వల రమేష్**

# పుస్తక సమీక్ష



## 'నిర్ణయ లేఖన కళ'- కే.విష్ణుశర్మ

విశ్రాంత డిప్యూటి రిజిస్ట్రార్, న్యాయశాస్త్ర నిపుణులు కే.విష్ణుశర్మ, నూతన న్యాయాధికారులకు, తెలుగు చదువరులకు న్యాయవిజ్ఞాన పరిజ్ఞానం అందించే సత్సంకల్పంతో భాగంగా 'నిర్ణయలేఖన కళ' సద్గ్రంథాన్ని రచించారు. మాతృభాషకు యింతగా ప్రాధాన్యత యిచ్చే భాషాభిమానిగా విష్ణుశర్మ, రచించిన 13 అధ్యాయాలలో సమగ్ర న్యాయశాస్త్ర 'నిర్ణయ లేఖనకళ'గా వెలుగు చూసింది. తెలుగులో సర్వోన్నత న్యాయస్థానం, వివిధ న్యాయస్థానాల తీర్పులను కూడా అనువదించి చేర్చడం అభినందనీయం. అపారమైన న్యాయశాస్త్ర అనుభవజ్ఞులైన రచయిత ఈ గ్రంథం ద్వారా తెలుగు భాషా వికాసానికి, న్యాయస్థానాల ఆంగ్లభాష అనుసరణ వ్యామోహాన్ని క్షీణింపచేసే ప్రయత్నానికి మార్గం చూపించారు. స్వాతంత్ర్యానంతరం స్వదేశీ భాషల ప్రాధాన్యతను ప్రభుత్వం, సమాజం గుర్తిస్తున్నా భాషాప్రయుక్త రాష్ట్రాలు ఆవిర్భవించినా న్యాయం, వైద్యం, విద్య, సాంకేతికత వంటి ప్రధాన అంశాలలోకి మాతృభాషలు చొచ్చుకుని పోలేని స్థితిగతులున్నాయి. ఈ గ్రంథంలో ఆంగ్లం-తెలుగు పారిభాషిక పదజాలం కూడా అందించడం విశేషాంశం. ఎస్.సి.జె.ప్రచురణలు వెలువరించిన ఈ గ్రంథం ప్రతీ న్యాయవాది, ప్రతీన్యాయస్థానం, కళాశాలలు, విద్యాసంస్థలు ఆదరించి అనుసరించినప్పుడే రచయిత కృషి ఫలిస్తుంది. కే.విష్ణుశర్మ అభినందనీయులు.

**(నిర్ణయ లేఖన కళ, రచన: కే.విష్ణుశర్మ, వెల: రూ 1260, ప్రతులకు: ఎస్.సి.జె.పబ్లికేషన్స్, 16-11-418/3, బాలాజీ సదన్, మూసరంబాగ్, హైదరాబాద్)** **- యర్రమిల్లి**

## వెన్నెలంత చల్లనైన బాలల కథలు



పిల్లలు వెన్నెలంత చల్లని మనసుగలవారు. వెన్న అంత మృదువైన మనసుగలవారు. దేశ భవిష్యత్తు వాళ్లు నిర్ణయిస్తారు. అయితే నేటి బాలలు కంప్యూటర్, ఇంటర్నెట్, వాట్సప్‌ల మాయాజాలంలో చిక్కుకుని పెడదోవపడుతున్నారు. వారిని మొక్కగా ఉన్నపుడే సన్మార్గానికి మళ్లించేట్లుగా చూడవలసిన బాధ్యత నేటితరం పెద్దవారిపై ఉంది. అమ్మలు, నానమ్మలు తాతయ్య వృద్ధాశ్రమ దోవపడుతున్నవేళ వారిని సన్మార్గంలో పెట్టటానికి పుస్తకాలు ప్రముఖపాత్ర పోషిస్తున్నాయి. ఈ అవసరం గమనించిన ఎన్.కె.బాబులాంటి సంపాదకులు, ఎన్.కె.పబ్లికేషన్స్ విజయనగరం లాంటి ప్రచురణ కర్తలు తమవంతు సాయం అందించేందుకు గొప్ప కృషి చేస్తున్నారు. సంపాదకులు బాబు ఏటా మంచికథల్ని రచయితల సహకారంతో ముద్రిస్తారు. అందులో భాగంగా బాబు 'వెన్నెలపూలు' బాలల కథా సంకలనం మనకందిస్తున్నారు. ఇందులో 27 బాలల కథలున్నాయి. కథారచయితలందరూ చేయి తిరిగిన వారవటం వల్ల కేంద్ర సాహిత్య అకాడమి బాలసాహిత్య పురస్కారగ్రహీత డా॥పత్తిపాక మోహన్ తన ముందు మాటలో చెప్పినట్లు 'ఇవి బాలలకు ఆనందం కలిగిస్తాయి. పది నుంచి పదిహేను వయసుగల బాలబాలికలను ఊహాలోకంలో విహరింపచేసి, వారిలో సన్మార్గాన్ని ప్రేరేపించేవిగా ఉన్నాయి. సంపాదకులకు ఇది మొట్టమొదటి ప్రయత్నం. **(వెన్నెలపూలు, పిల్లల కోసం కథలు, సంపాదకులు: ఎన్.కె.బాబు, వెల: రూ 150,ప్రతులకు: ఎన్.కె.పబ్లికేషన్స్, 24-8-1 సమీరా రెసిడెన్సీ, విజయనగరం)** **- కూర చిదంబరం**

భారత రాజ్యాంగం ఛత్రఛాయలో భారత ప్రజలు జీవిస్తున్నారు. పౌరులందరు రాజ్యాంగాన్ని తెలుసుకోవాలి. అర్థం చేసుకోవాలి. భారతరాజ్యాంగంలో మొత్తం 395 ఆర్టికల్స్ ఉన్నాయి. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం 1వ తరగతి నుంచి 12వ తరగతి వరకు 57లక్షల మంది విద్యార్థులందరికి భారత రాజ్యాంగం ప్రతిని ఉచితంగా అందజేస్తున్నది. డా॥బి.ఆర్. అంబేద్కర్ డ్రాఫ్ట్



## 'భారత రాజ్యాంగం..ముఖ్యాంశాలు'

కమిటీ ఛైర్మన్‌గా 1948, జనవరి నెలలో రాజ్యాంగం తొలిముసాయిదా ప్రతి విడుదల అయింది. 7,635, సవరణలు ప్రజల నుండి వచ్చాయి. నవంబరు 26 రాజ్యాంగ దినోత్సవం- 1950 జనవరి 26 నుండి రాజ్యాంగం అమలులోకి వచ్చింది. అదే రిపబ్లిక్ డే. 17వ ఆర్టికల్ ద్వారా అంటరానితనం నిషేధించబడింది. 42వ రాజ్యాంగసవరణ చట్టం (1976)లో వివరాలు రాసారు. న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం తెలుపుతాయి. ఆర్టికల్ 2: (నూతన రాష్ట్రాల స్థాపన). ఆర్టికల్ 12-(ప్రాథమిక హక్కులు, ఆర్టికల్ 14 చట్టం ముందు అందరూ సమానులే అన్నవి తెలుపును. ఆర్టికల్ 15 ద్వారా సామాజిక, వర్ణ, కుల, ప్రాంత, భాష, లింగ ప్రాతిపదికలపై అసమానత్వం తొలగించి సమానాత్వాన్ని ప్రతిపాదిస్తుంది. ఆర్టికల్ 19- భావప్రకటనా స్వేచ్ఛ మొదలైనవి. రాజ్యాంగంలోని 330 నుండి 342 వరకు ఆర్టికల్స్ పూర్తిగా ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు ప్రత్యేక సదుపాయాల సంబంధించినది. **(భారత రాజ్యాంగం ముఖ్యాంశాలు, రచన: బి.ఎస్.రాములు, వెల: రూ 50, ప్రతులకు: విశాల సాహిత్య అకాడమి)** **- తంగిరాల చక్రవర్తి**

పలు ప్రక్రియల్లో 80కిపైగా గ్రంథాలను వెలువరించిన బహుముఖ ప్రజ్ఞావంతుడు డా॥దేవరాజు మహారాజు తాజాగా ప్రకటించిన కవితాసంపుటి 'జన్యులిపి'. వృత్తిరీత్యా జీవం గురించి పరిశోధన చేస్తూ, ప్రవృత్తిరీత్యా జీవితం గురించి శోధిస్తున్నారు.



## దేవరాజు 'జన్యులిపి'..సమాజపు డిఎన్ఏ

'తెలిసీ తెలియని వాటిమధ్య కనబడీ కనబడని వాటి మధ్య/ పరిశోధనే..జీవితం' అంటున్న దేవరాజు తన కవిత్వ పొత్తంలో ఈ సమాజపు డి.ఎన్.ఏనే 'జన్యులిపి'గా అందిస్తున్నాడు. ఈ సమాజంలో మనల్ని మనం వెతుక్కోమని పిలుపునిస్తున్నాడు. సమాజమంటే మనిషే. 'ఏదైనాసరే, ఫ్రీ అనగానే ఎగబడే జనం/అదేమిటో కరోనా ఫ్రీ అంటే మాత్రం/ ముక్కూనోరు మూసుకుని పారిపోతున్నారు' యిదీ మనిషి నైజం. సమాజం యిజం. మనిషి ఒద్దనుకునేవి రెండే. ఒకటి అనారోగ్యం, రెండు మృత్యువు. అసలు మృత్యువంటే ఏమిటి? ఎవరైనా వెతికిపెడతారా? అని అడుగుతున్నాడు దేవరాజు. 'మృత్యువంటే జీవితం మీద నమ్మకం లేకపోవడం' అర్థం కాలేదా? 'కవిత్వం అర్థంకాని వాడికి/ విశ్వరహస్యాలేం అర్థం అవుతాయి?' ప్రతిపుటలో దేవరాజు మహారాజు కవిత్వపు పరిమళాల్ని ఆస్వాదించండి. ఎక్కడో ఒకచోట మీకు కవి దొరుకుతాడు. కవి వెతుకులాడేది దేనికొరకో అర్థమవుతుంది. 'జన్యులిపి' చేతుల్లోకి తీసుకోండి. గొప్ప కవిత్వం పలకరిస్తుంది. మనలోకి మనం తొంగి చూసుకోవచ్చు. **(జన్యులిపి, రచన: డా॥దేవరాజు మహారాజు, వెల: రూ 100, ప్రతులకు: అన్ని ప్రముఖ పుస్తకశాలలు)** **- రమణ వెలమకన్ని**



# మనసా! కృంగిపోకు..

డాక్టర్ ఎన్.బి.సుధాకర్‌రెడ్డి,
సైకాలజిస్టు

రాజస్థాన్‌లోని కోటాలో విద్యార్థుల ఆత్మహత్యలు కొనసాగుతున్నాయి. ఆగస్టు 27న రెండు వేర్వేరు ఘటనల్లో ఇద్దరు నీట్ ఆశావహులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఒక విద్యార్థి తాను కోచింగ్ తీసుకుంటున్న భవనం ఆరో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మరొక విద్యార్థి అద్దెగదిలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. ఇటీవల మరొక అమ్మాయి నీట్ కోచింగ్ తీసుకునే యువతి ఆత్మహత్యకు పాల్పడింది. ఇప్పటివరకు 30మంది దాకా బలవన్మరణాలకు బలయ్యారు. పరీక్షల ఒత్తిడి తట్టుకోలేక డిప్రెషన్‌కు గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. కోటాలో లక్షలాది మంది విద్యార్థులు దేశం నలుమూలల నుంచి ఇక్కడికి వచ్చి కోచింగ్ తీసుకుంటున్నారు. వరుస ఆత్మహత్యల నివారణకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇటీవల విద్యార్థుల గదుల్లో స్ప్రింగ్ లోడెడ్ ఫ్యాన్లను అమర్చారు. అలాగే హాస్టల్ బాల్కనీలు ఓపెన్‌గా ఉండకుండా 'యాంటీసూసైడ్ నెట్స్' అమార్చారు. అయినా ఆత్మహత్యలు ఆగడం లేదు.

యానాంకు చెందిన 22 ఏళ్ల యువతి ప్రేమించిన వ్యక్తి మరణించడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె రెండేళ్లుగా ఒక యువకుణ్ని ప్రేమిస్తున్నది. గంజాయికి బానిసైన అతడు సోదరుడు రూ 500 ఇవ్వలేదని ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటి నుంచి ఆమె అతని ఫొటోలను గోడకు అతికించి వాటినే చూస్తూ కుంగుబాటుకు గురయ్యింది. ఆఖరికి మనోవేదన భరించలేక ఉరేసుకుని చనిపోయింది.

తిరుపతి జిల్లా బాకరాపేట వద్ద అడవిలో ఇటీవల ఒక ప్రేమ జంట చెట్టుకొమ్మలకు ఉరేసుకుని ప్రాణాలు తీసుకున్నారు. ఇంటర్ రెండవ సంవత్సరం చదివే యువతి, యువకుడు ప్రేమించుకున్నారు. తెలిసీ తెలియని వయసులో ఈ పిచ్చిప్రేమలు ఏమిటని పెద్దలు దండించారు. పెళ్లి చేసుకోవడానికి నిరాకరించారు. దీనితో చావేశరణ్యం అన్న భావంతో నిండు జీవితాలను బలితీసుకున్నారు.

## ఆందోళన కలిగిస్తున్న ఆత్మహత్యలు

ప్రపంచ వ్యాప్తంగా ఆత్మహత్యలు చేసుకునే వారిసంఖ్య పెరిగిపోతోంది. ప్రపంచ ఆరోగ్యసంస్థ గణాంకాల ప్రకారం ఏటా 8,00,000 మంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ప్రతి 40 సెకన్లకు ఒకరు బలవన్మరణం పొందుతున్నారు. 15 నుంచి 29ఏళ్ల మధ్య వయసువారే ఎక్కువగా ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. మరణాలకు రోడ్డు ప్రమాదాల తరువాత రెండో ప్రధాన కారణం ఆత్మహత్యలే అని సర్వేలు వెల్లడిస్తున్నాయి. ఈ గణాంకాలు ఆందోళన కలిగిస్తున్నా, ఈ అంశంపై పెద్దగా చర్చ జరగడం లేదని ప్రపంచ ఆరోగ్యసంస్థ వ్యాఖ్యానించింది. ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకుంటే అది ఎంతోమందిపై ప్రభావం చూపుతుంది. తల్లిదండ్రులు, పిల్లలు, స్నేహితులు, సహచరులపై ప్రభావం పడుతుంది. ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకుంటే దానివల్ల 135 మంది వరకు ప్రభావితం అవుతారని అమెరికాలో జరిగిన ఒక అధ్యయనంలో వెల్లడయ్యింది.

మనదేశంలో కూడా ఏడాది ఏడాది ఆత్మహత్యలు చేసుకునేవారి సంఖ్య పెరిగిపోతున్నది. 2021లో దేశవ్యాప్తంగా పదివేలకుపైగా విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఇటీవల పార్లమెంటు స్థాయీసంఘం వెల్లడించింది. గత ఐదేళ్లలో దేశంలో జరిగిన ఆత్మహత్యల లెక్కలు ఆందోళన కలిగిస్తున్నాయి. 2017లో 1,29,887 మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారు. అలాగే 2018లో 1,34,516 మంది, 2019లో 1,39,123 మంది, 2020లో 1,53,052 మంది 2021లో 1,64,033 మంది బలవంతంగా ప్రాణాలు తీసుకున్నారు. వీరిలో వివిధ వర్గాల ప్రజలు, వయస్సులవారు ఉన్నారు. దీంతో 2030 నాటికి దేశంలో 10శాతం ఆత్మహత్యలను అయినా తగ్గించాలని నేషనల్ సూసైడ్ ప్రివెన్షన్ స్ట్రాటజీ (ఎన్ఎస్‌పిఎస్) వారు లక్ష్యంగా పెట్టుకున్నారు.

## ప్రతికూల భావాలే మూలం

ఆత్మహత్యలకు వివిధ కారణాలు పైకి కనిపిస్తున్నాయి. చదువుల ఒత్తిడి, ప్రేమ వైఫల్యం, అప్పులు, అనారోగ్యం, అవమానాలు, నిరుద్యోగం, ఉపాధి లేకపోవడం లాంటి అనేక కారణాలు ఆత్మహత్యలకు దారితీస్తున్నాయి. అయితే ప్రతికూల భావాలు, సున్నిత మనసు ఉన్నవారు ఎక్కువగా ఆత్మహత్యలకు పాల్పడుతుంటారు. మితిమీరిన అహంభావం ఉన్నవారు కూడా ఓటమి అవమానం భరించలేక ఆత్మహత్యలకు పాల్పడుతుంటారు. ఆరాధనా భావం ఉన్న వారు కూడా తమకు ఇష్టమైన వారికోసం బలవంతంగా ప్రాణాలు తీసుకుంటుంటారు. కొంతమంది మూఢనమ్మకాలతో ప్రాణాలు బలిపెట్టుకుంటున్న సందర్భాలు ఉన్నాయి. ❑

క్రీస్తుపూర్వం నుంచే ఆత్మహత్యలు చేసుకున్న వారు ఉన్నారు. గ్రీకు రాజులు, రోమను ప్రభువుల కాలంలోనే ఆత్మహత్యలకు అంకురార్పణ జరిగినట్టు చరిత్ర చెపుతోంది. అయితే అరిస్టాటిల్ ఇతర సామాజికవేత్తలు ఆనాడే ఆత్మహత్యలు చేసుకోవడం తగదని సమాజానికి తెలియజేప్పే ప్రయత్నం చేశారు. ఆత్మహత్య చేసుకుంటే మరొక మంచి జన్మ ఉంటుందని కొందరు భావిస్తే, అది పాపమని మానసిక స్థితిని గూర్చి అధ్యయనం చేయలేదనిపిస్తుంది. కానీ మనసును మార్చడానికి పాపం, పుణ్యం అన్న భావాలను ప్రచారం చేసే ప్రయత్నం చేశారు. అయితే 1897లో సామాజిక శాస్త్ర పితామహునిగా పిలువబడే దుర్క్‌హైమ్ ఆత్మహత్యలు సిద్ధాంతాన్ని సూత్రీకరించారు. ఆయన అధ్యయనం ప్రకారం ఆత్మహత్యలు చేసుకునే వారిని నాలుగు రకాలుగా వర్గీకరించారు. ఆయన ప్రకారం అహంకార ఆత్మహత్య, పరోపకార ఆత్మహత్య, అనోమీ (ఒత్తిడి) ఆత్మహత్య, ప్రాణాంతక ఆత్మహత్యగా చెప్పవచ్చు. అయితే ఆధునిక మానసిక నిపుణులు అన్నిరకాల ఆత్మహత్యలకు కారణాలు ఏవైనా మూలం మాత్రం మనసే అంటున్నారు. ప్రతికూల భావాలు, సెంటిమెంట్లు, బలహీన ఆలోచనలు ఉన్నవారు ఒత్తిడి, డిప్రెషన్‌కు గురై ఆత్మహ్యలకు బలవుతున్నారని అంటున్నారు. ఆశావాదం, సానుకూల దృక్పథం లేనివారు త్వరగా ప్రతికూల ఉద్వేగాలకు లోనవుతారు. భయం, ఆందోళన, అసహనం, సంఘర్షణకు గురవుతారు. దీనివల్ల ఒత్తిడి పెరుగుతుంది. కొద్దిరోజుల పాటు లేదా దీర్ఘకాలం ఒత్తిడికి గురైన వారు డిప్రెషన్ బారినపడతారు. డిప్రెషన్ వల్ల జీవితం పట్ల విరక్తి కలుగుతుంది. లోకమంతా శూన్యంగా కనిపిస్తుంది. మరోమార్గం లేదనిపిస్తుంది. మనసును తొలచివేసే వ్యధను తట్టుకోలేక చావే శరణ్యం అనుకుంటారు. ఆత్మహత్య చేసుకుని జీవితాన్ని బలిపెట్టుకుంటారు.



**ఆశావాదమే పరిష్కారం**

ఆత్మహత్యల నివారణకు ఆశావాదం, సానుకూల దృక్పథమే పరిష్కారం. తమ సమస్య పరిష్కారానికి మరొక మార్గం లేదని భావించే వారిని ఆదరించి, పరిష్కారమార్గాలు సూచించగలిగితే ఆత్మహత్యా భావం నుండి బయటికి తీసుకురావచ్చు. మాటలు, కౌన్సెలింగ్ సరిపోలేదనిపిస్తే సైకియాట్రిస్టు ద్వారా చికిత్స అందిస్తే చాలు. తప్పకుండా మార్పు తీసుకురావచ్చు. 20ఏళ్ల క్రితం ప్రేమ విఫలమై ఆత్మహత్యా ప్రయత్నం చేసి బయటపడిన ఒక యువతి నావద్దకు కౌన్సెలింగ్ కోసం వచ్చింది. తనను ఒక అబ్బాయి గాఢంగా ప్రేమించి, సర్వస్వం దోచుకుని మోసం చేశాడని వాపోయింది. అబ్బాయికి ఉద్యోగం రాగానే తన కులం, కుటుంబం గుర్తుకు వచ్చి మాట మార్చాడని చెప్పింది. తన దీనస్థితిని చూసి తల్లిదండ్రులు, స్నేహితులు కూడా తనదే తప్పన్నట్టు మట్లాడారని బాధపడింది. దీంతో ఉరిపోసుకుని చనిపోవాలని ప్రయత్నిస్తుండగా తన తల్లి కిటికీలో నుంచి చూసి, ఇరుగుపొరుగు సాయంతో కాపాడిందని చెప్పుకొచ్చింది. ఎన్ని చెప్పినా అతను కాదంటే తాను బతకడం వృథా అంటూ ఏడవడం ప్రారంభించింది. ఆ సమయంలో ఆమెకు ఒక సమస్య చెప్పి పరిష్కారం కోరాను. నాకు తెలిసిన ఒక అమ్మాయికి పెళ్లయిన నెలకే ప్రమాదంలో భర్త చనిపోయాడు. ఆమె మళ్లీ పెళ్లి చేసుకోవాలంటే ఆమె తల్లిదండ్రుల మాటకే మద్దతు ఇచ్చాను. మీ అభిప్రాయం చెప్పండి అని ప్రశ్నించాను. దానికి ఆమె సుదీర్ఘ ఉపన్యాసం ఇచ్చింది. సతీసహగమనం నుంచి వితంతు వివాహం వరకు జరిగిన మార్పులను చెప్పింది. భర్త చనిపోయిన ఆమె మరొక పెళ్లి చేసుకోవడమే న్యాయం అంటూ వాదించింది. దానితో నేను ఆమె దారిలోకి వెళ్లి తన ప్రేమికుడు కూడా చనిపోయాడని భావించి కొత్త జీవితం ప్రారంభించమని సలహా ఇచ్చాను. ఈ తర్కం ఆమె మనసును మార్చింది. మూడునెలల్లో పెద్దలు కుదిర్చిన పెళ్లి చేసుకుని హాయిగా జీవిస్తున్నది.

బాలీవుడ్ హీరోయిన్ దీపికా పదుకొనే ఒక దశలో డిప్రెషన్‌కు గురైంది. తన మానసిక స్థితిని గుర్తించిన ఆమె తల్లి సలహా మేరకు సైకియాట్రిస్టును కలిసి చికిత్స తీసుకున్నది. తీవ్రమైన డిప్రెషన్, ఆత్మహత్యాభావాల నుంచి బయటపడ్డది. ఆ విషయం ఆమె పలు సందర్భాలలో మీడియాకు చెప్పింది. డిప్రెషన్ నుండి బయటపడండి, ఆత్మహత్య భావాల నుంచి బయటపడండి అంటూ సమాజానికి సందేశం ఇచ్చింది. ఇప్పుడు తిరిగి టాప్ హీరోయిన్‌గా కొనసాగుతున్నది.

రామాయణంలో హనుమంతుడు సీతాదేవి జాడ తెలుసుకోవడానికి సముద్రం దాటి లంకకు వెళ్లాడు. అక్కడ ఎంత వెదికినా సీత కనిపించకపోవడంతో తీవ్రమైన ఒత్తిడికి గురయ్యాడు. ఇక తన ముఖం రామునికి చూపలేనని భావించి ఆత్మహత్య చేసుకోవాలని భావించాడు. అయితే అంతలోనే మనసు మారింది. తాను చనిపోతే రామునికి సమాచారం తెలియదని భావించాడు. తాను తిరిగి వెళ్లి సీత లంకలో లేదన్న విషయం తెలియజేస్తే మరొకవైపు వెళ్లి వెదుకుతారని స్ఫురించింది. రాత్రి నిద్రపోయి ఉదయం తిరిగి వెళ్లిపోదామని తలంచి అశోక వృక్షంపైకి వెళ్లాడు.

ఉదయం సూర్యోదయం కాగానే చెట్టుకింద విలపిస్తున్న సీత కనిపించింది. సీతను కలసి, లంకాదహనం చేసి, రామునికి సీత జాడ తెలిపాడు. అంటే మనిషి దృక్పథం, ఆలోచనల్లో మార్పు తీసుకురాగలిగితే ఆత్మహత్యలను నివారించవచ్చు. సమస్యలకు ప్రత్యామ్నాయ మార్గాలను చూపగలిగితే చిగురిస్తుంది. చుట్టూ ఉన్నవారు ఆదరిస్తే ఆత్మవిశ్వాసం కలుగుతుంది. చికిత్స చేయిస్తే ఆత్మ హత్య భావాలను తగ్గించవచ్చు. కాబట్టి తీవ్రమైన ఒత్తిడి, డిప్రెషన్‌కు చికిత్స చేయిస్తే ఆత్మహత్య భావాలను తగ్గించవచ్చు. డిప్రెషన్‌తో బాధపడే వారిని గుర్తించి కౌన్సెలింగ్ అవసరం.

**(మిగతా 19వ పేజీలో)**





కథ

# స్ఫూర్తి


వామనగిరి రాజు వాసుదేవుడు ఎంతో ధర్మబద్ధంగా పరిపాలించేవాడు. రాజ్యంలో ఎవరికీ ఏకష్టం రాకుండా మారుమూల గ్రామాల్లో కూడా నీటి కొరత లేకుండా ఏర్పాట్లు చేశాడు. 'ప్రతి ఒక్కరికీ విద్య' అనే నినాదంతో గురుకులాలు స్థాపించి అనేక ఇతర సేవలు అందరికీ అందేట్టు చూసేవాడు.

ఇలా ప్రజలకు మంచి పనులు అనేకం మంత్రులతో చర్చించి వారిచ్చే సలహాలు కూడా తీసుకుంటూ పటిష్టంగా అమలయ్యేట్టు చూసేవాడు.



ఒకసారి మంత్రి సుముఖుడితో కలిసి ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు నేదనూరు అనే గ్రామానికి వెళ్లాడు. అక్కడ చాలామంది వ్యవసాయ పనులకు వెళ్లారు. రెండు ఇళ్లలో ఇద్దరు వృద్ధులు ఒంటరిగా ఇళ్లలో కూర్చుని ఉన్నారు. ఒక వృద్ధుణ్ణి 'అదేమిటి ఒంటరిగా ఇంట్లో ఉన్నావు తాతా మీ వాళ్లు నిన్ను వారు పని చేసే దగ్గరకు తీసుకు వెళ్లలేదా?' అడిగాడు మంత్రి సుముఖుడు.

'లేదయ్యా నేను పెద్దవాణ్ణి అయిపోయ్యానని నన్ను తీసుకువెళ్లలేదు. వారు వచ్చేవరకు నేను ఒక్కడినే ఇక్కడ కూర్చుని ఉంటాను. అదే మా వృద్ధుల పాలిట నరకం' అని చెప్పాడు ఆ పెద్దాయన.



'మరి నీవు చదువుకున్నావా? ఏ కళలోనైనా ప్రవేశముందా?' అడిగాడు మంత్రి.

'అయ్యా నేను కొంతవరకు చదువుకొన్నాను. కానీ గ్రంథాలు కొనే స్థోమత లేదు. నాకు కొంత చిత్రకళలో కూడా ప్రవేశముంది కానీ కుంచెలు రంగులు కొనలేను కనీసం కొన్ని గ్రంథాలు, చిత్రకళకు ఉపయోగపడేవి ఉంటే కొంత కాలక్షేపం ఉండేది' దిగులుతో చెప్పాడు ఆ పెద్దాయన.

అతడి మాటలు వాసుదేవుడిని, సముఖుడ్ణి ఆలోచింప చేశాయి. ప్రతి ఊరిలో ఈవిధంగా అనేకమంది వృద్ధులు ఒంటరితనంతో బాధ పడుతున్నట్టు వారికి అర్థమైంది.

వెంటనే రాజు తన దర్బారులో మంత్రులతో చర్చించి, ప్రతి ఊరిలో ఓ గ్రంథాలయం, కళలకు పనికి వచ్చే సామగ్రి పెడితే, వారి మెదడుకి పదును, వారికి వచ్చిన కళలను సార్థకం చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. అదిగాక వారికి జరిగే కాలక్షేపం వలన మానసిక, శారీరక ఆరోగ్యాలు కలుగుతాయని చర్చించారు.

వాసుదేవుని ఆలోచనని దర్బారులోని వారందరూ ఎంతో మెచ్చుకున్నారు.

ఈవిధంగా ప్రతి ఊరిలో గ్రంథాలయాన్ని, కళా నిలయాల్ని స్థాపించారు. క్రమేపీ వృద్ధులకు సంభవించే అనారోగ్యాలు కూడా తగ్గిపోసాగాయి! రాజు వాసుదేవుడు చేసిన మంచి పనిని ఇతర రాజ్యాలవారు కూడా ఆచరించారు. ఏదైనా మంచి ఆలోచన ఇతరుల్లో కూడా స్ఫూర్తి నింపుతుంది కదా!

**- కంచనపల్లి వేంకట కృష్ణారావు**






## బాలగేయం

### రైతన్న



హలం దున్నే రైతన్న
కలం పట్టి రాయన్న
అలుకు మొలకలను
అక్షరాలుగా మార్చన్న
పొలం బడిలో రాజోలె
అక్షర సేద్యం చేయన్న
కష్టనష్టాలు ఎదురైనా
వెన్ను చూపక ఓ అన్న
ఆరుగాలం పంట కోసం
అహోరాత్రులు చదువన్న
మధురపద్యాల పొలంలో
మణిదీపమై వెలుగన్న
రామసక్కని గాలిపటమై
రాజోలె జగతిపై ఎగురన్న

**- దుర్గమ్ భైతి**



## హలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**

**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**

## గిరీష్ అంకుల్ సమాధానాలు

**- ఎ.ధృవ,** నందికొట్కూరు

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. రైలు కూతలలో ఏమైనా ప్రత్యేక అర్థాలున్నాయా?



**జవాబు:** ధృవ! రైలు బయలుదేరే ముందు గట్టిగాకూత వేయడం, మధ్యలో అక్కడక్కడా ఇలాగే గట్టిగా సైరన్ మోగించడం వింటుంటాం. రైలు డ్రైవరు తన ఇష్టం వచ్చినప్పుడు ఎప్పుడైనా కూత పెట్టవచ్చా అంటే వీలు లేదనే చెప్పాలి. రైలు కూత పెట్టిన ప్రతీ సందర్భానికి ఒక ప్రత్యేకత ఉండాల్సిందే. అందులోని అర్థాలు రైల్వేలో పనిచేసేవారికి మాత్రమే అర్థమయ్యే కోడ్ భాషలా అనిపిస్తుంది. బ్రిడ్జిలు, టన్నెళ్లను దాటుతున్నప్పుడుగానీ, స్టేషన్లను దాటుతున్నప్పుడుగానీ గమనిస్తే రైలు చేసే చప్పుడులో ప్రత్యేకత కనిపిస్తుంది. స్టేషన్ దగ్గరవుతున్నప్పుడు, దాటుతున్నప్పుడూ సుదీర్ఘమైన కూత వినిపిస్తుంది. రైల్వేలో ఇంజిన్ విజిల్ కోడ్‌కు ఒక ప్రత్యేకత ఉంది. అంటే కూత వ్యవధి, సంఖ్యలను బట్టి ప్రతి రైలుకూతకూ ప్రత్యేకమైన అర్థం ఉంటుందన్నమాట. రైలు ఇంజిన్ కదలికకు ముందు, సొరంగం(టన్నెల్)లోకి వెళ్లేముందూ, ఏవైనా ప్రత్యేక ఆదేశాలున్నప్పుడు, ఏదైనా ప్రమాదం జరిగి అవరోధం ఏర్పడి రైలు కదలలేని పరిస్థితుల్లో రైలు నుంచి తక్కువ వ్యవధిలో కూతలు నాలుగు సార్లు విన్పిస్తాయి. అప్పుడు గార్డు వాటిని అర్థం చేసుకుని బ్రేకులు వేస్తాడు. రైలు లెవెల్ క్రాసింగ్‌కు దగ్గరైనప్పుడు బాగా పొడవైన కూత విన్పిస్తుంది. టన్నెల్ సమీపించినప్పుడూ ఇంతే. ఈ కూత రైల్వే పట్టాల మీదుగా నడుస్తున్నవారికి, టన్నెల్లో ఉన్నవారికి హెచ్చరిక అని అర్థం చేసుకోవాలి. వాకీటాకీలు వచ్చాక పని సులభమైంది కానీ ఒకప్పుడు 'కూ' అంటూ పెట్టే రైలు కూతే ఎన్నో సందేశాలను అందించేది.



# ఇంకా అసమానత్వమేనా!

**దేశ** జనాభాలో సగభాగం వున్న మహిళలు పురుషులతో పాటు సమానమేనని భారత రాజ్యాంగం చెబుతోంది. సమాన అవకాశాలు కల్పిస్తామని పాలకులు తరచూ చెప్తుంటారు. కానీ వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉన్నాయని వరల్డ్ ఎకనామిక్ ఫోరం నివేదికలో తేలింది. సమానత్వం కోసం వందేళ్లు ప్రస్తుత పరిస్థితులు ఇలాగే కొనసాగితే సమానత్వం కోసం మహిళలు వందేళ్లు నిరీక్షించాలని అంతేకాకుండా స్త్రీ పురుష అసమానతలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. 2006 నుంచి పోలిస్తే ఈ ఏడాది స్త్రీ పురుషుల అసమానతలు పెరిగాయని ప్రపంచ ఆర్థిక ఫోరం తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా 144 దేశాల్లోని విద్య వైద్య రాజకీయ ఆర్థిక విషయాల్లో మహిళల భాగస్వామ్య అధ్యయనం చేసి వరల్డ్ ఎకనామిక్ ఫోరం సమగ్ర నివేదికను రూపొందించింది. మగవాళ్లకు వున్న అవకాశాల్లో స్త్రీలకు కేవం 68 శాతం మాత్రమే ఉన్నాయని నివేదిక తెలిపింది. వివక్షత 'శ్రమ దోపిడీ' లింగ అసమానతలు స్త్రీల పాలిట శాపమైంది. స్త్రలు కేవలం సెక్స్ సింబల్‌గా చూసే వాతావరణం చోటు చేసుకోవడం ఆందోళన కలిగిస్తోందని నివేదిక స్పష్టం చేసింది. బడిలో చదువుకునే చోట పాఠ్యపుస్తకాలలో లింగ వివక్షతపై పాఠ్యాంశాలు చోటు చేసుకున్నాయని తెలిసింది.



ప్రపంచవ్యాప్తంగా అన్ని రంగాల్లో పురుషులతో పాటు మహిళలు సమానంగా అభివృద్ధి కావాలంటే మరో 83ఏళ్లు పడుతుందని 2016 అంచనా వేశారు. ప్రభుత్వాలు చేపట్టిన చర్యల వల్ల విద్య ఆరోగ్యవిషయంలో మహిళల పరిస్థితి కొంత మెరుగ్గానే ఉంది కానీ ఆర్థిక రాజకీయ విషయాలు ఆశించినంతగా మెరుగుపడలేదు. ప్రపంచవ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉంది అని తేలింది. ఉద్యోగ రంగంలో సమానత్వం రావాలంటే మహిళలు 217 యేళ్లు ఎదిరిచూడాలని అప్పటి పరిస్థితులు స్త్రీ పురుష సమానత్వ సాధనలో కీలక పాత్ర పోషిస్తాయిని వరల్డ్ ఎలనామిక్ పోరం తెలిపింది. ప్రపంచ దేశాలలో స్త్రీపురుష అసమానతలు ఎక్కువగా వున్నాయి. అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే అభివృద్ధి చెందుతున్న వర్ధమాన దేశాలలో స్త్రీలు పురుషులతో సమానంగా అన్ని రంగాలలో పోటీ పడుతున్నప్పటికీ ఉపాధి ఉద్యోగ ఆర్థిక రాజకీయ రంగాలలో తీవ్రవివక్షతను ఎదుర్కొంటున్నారు. మనపొరుగు దేశాలైన బంగ్లాదేశ్ చైనాలో స్త్రీల పరిస్థితి మనదేశంలోని స్త్రీలకంటే మెరుగుగా వుంది. మహిళలకు గోవా సురక్షిత ప్రాంతమని బీహారులో స్త్రీలకు రక్షణ తక్కువ వుందని వరల్డ్ ఎకనామిక్ ఫోరం తెలిపింది. మహిళలు ఆరోగ్యం దేశంలోని మహిళా ఆరోగ్యం విషయంలో కేరళ టాప్‌ప్లేస్‌లో వుండగా సిక్కిం తమిళనాడు కర్ణాటక, ఎపి, గోవా, మహారాష్ట్ర తర్వాత స్థానాల్లో వున్నాయి. విద్య, వైద్య ఆర్థికరంగాలలో తెలంగాణ 11వ స్థానం ఎపి 12వ స్థానంలో వున్నాయి. సమాన పనికి సమాన వేతన విధానం అమలులో లేకపోవడం వల్ల స్త్రీ పురుషుల వేతనాల్లో అసమానతలు వివక్ష చూపిస్తున్నారని వరల్ ఎకనామిక్ ఫోరం నివేదికలో తెలిపింది. మహిళలు చేసే ఇంటిపనికి విలువ కట్టడం లేదు. ప్రజల ఆలోచనావిధానం మారాలి. ప్రభుత్వం నూతన విద్యావిధానంలో మహిళల పట్ల గౌరవం మహిళా సాధికారిత మహిళాస్థాయిని పెంచే పాఠ్యాంశాలు విద్యాసంస్థలో ప్రవేశపెట్టాలి. ప్రభుత్వం బాల్యదశ నుంచే కుటుంబంలో సమాజంలో మహిళల పట్ల గౌరవం పెంచే చర్యలు తీసుకోవాలి. మహిళా హక్కుల రక్షణ భద్రత చట్టాల మీద మహిళా సంఘాలకు అవగాహన. చైతన్య సదస్సులు నిర్వహించాలి. దేశంలోని యూనివర్సిటీల్లో మహిళా అభివృద్ధి సమస్యల అధ్యయన పరిశోధన కేంద్రాలను ఏర్పాటు చేయాలి. కేంద్రరాష్ట్ర స్థానిక ప్రభుత్వాలు మహిళా సాధికారిత మహిళా హక్కుల రక్షణే మానవ హక్కుల రక్షణ లక్ష్యంగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు స్త్రీ పురుషులకు సమాన అవకాశాలు కల్పించాలి. దేశరాజకీయాలలో సాధనలో మహిళాభ్యుదయానికి పెద్దపీట వేయాలి.

**- నేదునూరి కనకయ్య**

## 'జమిలి' గుబులు!

(10వ పేజీ తరువాయి)

ఉత్తర, దక్షిణ, ఈశాన్య, పశ్చిమ దేశంలో ఉన్న విభిన్న సాంస్కృతిక రాజకీయ ఆర్థిక భిన్నత్వం ప్రధాన మంత్రికి ప్రత్యక్ష ఎన్నిక అనే విషయంలో అవరోధంగా నిలుస్తుంది. కనుక పార్లమెంటును శాశ్వత సభగా ప్రకటించి అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టినప్పుడు విశ్వాస తీర్మానాన్ని కూడా ప్రవేశపెట్టి ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే పార్టీకి పట్టం కట్టినప్పుడు అనవసర అవిశ్వాస తీర్మానాలు ప్రభుత్వాలు పడిపోవడం ఉండదు. కనుక ఈ పద్ధతి ద్వారా పార్లమెంటును కూడా ఒక రకంగా శాశ్వత సభగా మార్చవచ్చు. మనసుంటే మార్గం ఉంటుంది. ఒక పని చేయబోయి మరో సమస్య కొనితెచ్చుకోకూడదు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం చేస్తున్న పని అదే. దేశంలోని అసలైన సమస్యలు ఎన్నో ఉండగా జమిలి ఎన్నికలు అనే ప్రస్తావన తెచ్చి ఒకే దేశం ఒకే ఎన్నిక ఒక సెంటిమెంటును రెచ్చగొట్టి ఇతర సమస్యల నుండి ప్రజలను పక్కదోవ పట్టించడానికి ఇలాంటి ఎత్తుగడ అనుసరిస్తుంది. ఇది సరైనది కాదు. దేశంలో కావాల్సింది అభివృద్ధి. ప్రపంచ దేశాలతో పోటీపడి మనం అభివృద్ధి చెందాలంటే దేశంలోని పాలనా విధానాలు మారాలి. అవినీతి పోవాలి. పాలనలో వికేంద్రీకరణ రావాలి. రాష్ట్ర అధికారాల్లో కేంద్రం, స్థానిక



ప్రభుత్వాలు అధికారాల్లో రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకోకుండా ఆయా ప్రభుత్వాలను పనిచేసుకోనిస్తే అప్పుడు నిజమైన ప్రజాస్వామ్యం సిద్ధిస్తుంది. ప్రజాస్వామ్యం అంటే మందస్వామ్యం, మూకస్వామ్యం కాదు. ప్రజాస్వామ్యం అంటే ప్రజలు ప్రభువులుగా పాలకులు సేవకులుగా ఉండాల్సిన పద్ధతి. ప్రస్తుతం పాలకులు ప్రజల నెత్తి మీద ఎక్కి నాట్యం చేస్తుంటే, ఎన్నికల్లో డబ్బు, మద్యం వీర విహారం చేస్తుంటే ప్రజాస్వామ్యమా నీవెక్కడ? అని సామాన్య ప్రజలు ప్రశ్నిస్తున్నారు. దేశంలో పేదరికం పోవాలంటే పాలనలో పారదర్శకత జవాబుదారీతనం పెరగాలి. ప్రస్తుతం దేశంలో పరిపాలన అంటే సామాన్యుడికి వీడని చిక్కుముడిగా అందని ద్రాక్షగా మారింది. ప్రజాస్వామ్య హననం జరుగుతున్నప్పుడు దానికి ప్రజలే పావులుగా బలి అవుతారు. నిజమైన ప్రజాస్వామ్యంలో ప్రజల ప్రాథమిక హక్కులు కాపాడబడతాయి. హక్కుల కోసం కలబడు బాధ్యతల కోసం నిలబడు అనే సూక్తి నిజమవుతుంది. అందుకే భారత ప్రజాస్వామ్యానికి కాయకల్ప చికిత్సలు అరకొర సంస్కరణలు సరిపోవు. జమిలి ఎన్నికలు అనే విషయం పక్కన పెట్టి దేశంలో పాలనా సంస్కరణలు, రాజకీయ సంస్కరణలు, ఎన్నికల సంస్కరణలు, పోలీసు న్యాయ సంస్కరణలు చిత్తశుద్ధితో అమలు చేసినప్పుడు మాత్రమే భారతదేశంలో ప్రజాస్వామ్యం విరాజిల్లుతుంది. అప్పుడు ప్రజలే ప్రభువులు.. పాలకులు సేవకులే అవుతారు. ❑

## మనసా! కృంగిపోకు..

(15వ పేజీ తరువాయి)

ముందే గుర్తించాలి.

ఆత్మహత్య భావాలు ఉన్నవారిని ముందే గుర్తించవచ్చు. నిరాశా, నిస్పృహలు వ్యక్తపరుస్తుంటారు. ఆకలి, నిద్రకు దూరమవుతారు. సుఖ, సంతోషాలు వ్యక్తీకరించరు. ఒంటరిగా ఉండటానికే ఇష్టపడతారు. తల్లిదండ్రులు స్నేహితులతో కూడా కలవడానికి ఇష్టపడరు. వేదాంతాలు వల్లిస్తుంటారు. చావు పుట్టకలపై గూర్చి మాట్లాడుతుంటారు. మిత్రులకు మెసేజ్‌పెట్టడం, డైరీలో రాయడం, ఫోన్‌లో చెప్పడం చేస్తుంటారు. ఆత్మహత్యకు అవసరమైన మందులు, వస్తువులను సేకరిస్తుంటారు. బరువు బాగా తగ్గిపోతారు. ఇలాంటి కొన్ని లక్షణాలు కనిపించగానే వారి మనోగతం తెలుసుకునేందుకు ప్రయత్నించాలి అనునయంతో సమస్యలను తెలుసుకోవాలి. ఆదరణతో పరిష్కారమార్గాలు సూచించాలి. ఒక మోస్తరు దశలో ఇది వీలవుతుంది. కొద్ది ఎక్కువగా ఉన్నప్పుడు సైకాలజిస్టులను కలిసి కౌన్సెలింగ్ చేయించాలి. తీవ్రమైన లక్షణాలు ఉంటే మాత్రం తక్షణం సైకియాట్రిస్టుకు చూపాలి. అలాగే అభిరుచులు కలిగించడం, డైవర్ట్ చేయడం మంచిది. సమతుల ఆహారం, శారీరక వ్యాయామాలు, యోగ, ధ్యానం లాంటివి ఉపయుక్తంగా ఉంటాయి. అయితే మన సమాజంలో సరైన అవగాహన లేకపోవడం వల్ల చచ్చేవరకు పట్టించుకోవడం లేదు. కొందరికి తెలిసినా నలుగురికి భయపడి దాచుకుని, దారుణం జరిగాక ఏడుస్తుంటారు. మానసిక రుగ్మతలు, డిప్రెషన్ కూడా శారీరక రుగ్మతలు, వ్యాధులలాంటివే అన్న భావన రావాలి. మానసిక సమస్యలు రాగానే నిపుణులను సంప్రదించాలి. ఆలోచనలు మార్చి, ఆశావాదం కలిగిస్తే ఆత్మహత్యలను నివారించవచ్చు. అలా కాకుండా ఫ్యానులకు స్ప్రింగులు అమర్చడం, హాస్టల్ బాల్కనీలకు వలలు ఏర్పర చడం పరిష్కారం కాదు. ప్రేమ విఫలమైతే మరొకరిని ప్రేమించడం తప్పు కాదన్న భావం కలిగించాలి. ఇక్కడ నైతిక విలువలకంటే ప్రాణం ముఖ్యమన్న ఆలోచన ముఖ్యం. చదువుల ఒత్తిడిని పరిష్కారమార్గాలు వెదకాలి. అప్పులు తీర్చడానికి మార్గం చూపాలి. ఉద్యోగం రాకున్నా, పెళ్లి కాకున్నా, అనుకున్నవి సాధించలేకపోయినా జీవించడం గొప్పదన్న భావం పెంచాలి. చావు దేనికీ పరిష్కారం కాదన్న సత్యం గుర్తించాలి. అప్పుడే ఆత్మహత్యల నివారణ సాధ్యం. ❑



కథ

# ఇష్టసఖి

మాలాకుమార్

**కాలేజీ ఆవరణంతా కోలాహలంగా ఉంది. ఆరోజే ఇంజినీరింగ్ మొదటి సంవత్సరంలో చేరే విద్యార్థులు కొంత మంది బెరుకు బెరుకుగా, కొంత మంది ఉషారుగా కాలేజీకి వస్తున్నారు. ఒకరినొకరు పరిచయం చేసుకుంటున్నారు.**

కాలేజీ వాతావరణాన్ని కుతూహలంగా పరిశీలిస్తున్న అలోక్ 'హాయ్' అన్న పలకరింపుతో తిరిగి చూసాడు. లేత నీలిరంగు కుర్తా, జీన్స్ పాంట్‌లో మొహాన పడుతున్న జుట్టును వెనకకు సుతారంగా నెడుతూ నవ్వు మొహంతో ఉన్న అమ్మాయిని చూసి, వినీ వినిపించకుండా 'హాయ్' అన్నాడు.

"నా పేరు వెన్నెల" అన్నది చేయి చాపుతూ.

"నేను అలోక్" అన్నాడు తడబడుతూ చిన్నగా వెన్నెల చేతిని తాకుతూ.

ఆష్ కలర్ టీ షర్ట్, జీన్స్ పాంట్, సన్నని మీసకట్టుతో స్మార్ట్‌గా ఉన్న ఈ అబ్బాయికి ఇంత బెరుకేమిటో అనుకుంటూ అలోక్‌ను ఎగాదిగా చూస్తూ "మనదే కాలేజ్ బాస్?" అడిగింది.

"పబ్లిక్ స్కూల్" జవాబిచ్చాడు.

"స్కూల్ పోరగాడివా? పర్లేదులే కాలేజ్ పోరగాడిని చేస్తాం కదే శ్రావ్యా?" నవ్వుతూ పక్కనున్న శ్రావ్యతో అంది.

బాబోయ్ సూపర్ ఫాస్ట్! మనసులోనే భయపడ్డాడు కానీ ఆ సూపర్ ఫాస్ట్ అమ్మాయే అంతకన్నా సూపర్ ఫాస్ట్‌గా స్నేహం కలిపేసింది. నెమ్మదస్తుడు, మొహమాటస్తుడు, అందగాడూ అయిన అలోక్ అంటే ఇష్టం ఏర్పడింది వెన్నెలకు. ఆ ఇష్టం ఇంజినీరింగ్ పూర్తయ్యేసరికి ప్రేమలోకి దింపేసింది. ధనవంతుల ఏకైక గారాలపట్టి అని మొదట్లో దూర దూరంగా ఉన్నా, వెన్నెల చూపించే ప్రేమ, చనువుతో వెన్నెలతో పూర్తిగా ప్రేమలో మునిగిపోయాడు అలోక్.

వెన్నెల తండ్రి కృష్ణారావు పెద్ద వ్యాపారస్తుడు. తల్లి వల్లి వివిధ వ్యాపకాలతో బిజీ బిజీగా ఉంటుంది. అలోక్ తండ్రి శివరావు పెద్ద పొజిషన్‌లో ఉన్న ఉద్యోగస్తుడు. తల్లి వాణి గృహిణి. శివరావు తల్లి చనిపోతే తండ్రి గోపాలరావు ఒక్కడినే పల్లెలో ఉంచటం ఇష్టంలేక తన దగరికి తీసుకొచ్చేసాడు.

చెల్లెలు శ్రీదేవి, బావగారు రామారావు, మేనకోడలు అవని, పక్క ఇంట్లోనే ఉంటారు. ఒక విధంగా చెప్పాలంటే సాంప్రదాయ, ఉమ్మడి కుటుంబమే! ఇలాంటి కుటుంబ నేపథ్యాలున్న తమ ఇద్దరికి ఎట్లా కలుస్తుందని అలోక్ వెనకడుగు వేస్తుంటే- వెన్నెలలోని ఆకర్షణ ముందుకు నెట్టింది. వెన్నెల కూడా వచ్చి తండ్రితో మాట్లాడమని ప్రోత్సహించింది వెన్నెల.

చిన్నప్పటి నుండి అవనిని తన భార్యగా చూస్తున్న తన వాళ్లను ఎట్లా ఒప్పించాలో తెలియలేదు. ప్రేమించేటప్పుడు గుర్తురానివన్నీ ఇప్పుడు గుర్తొచ్చి ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి అలోక్‌ను. ప్రేమను జయించలేక చిన్నగా తాతయ్యకు చెప్పాడు తన ప్రేమ కథను.

గోపాలరావుకు ఒక్క క్షణం తను ఏమి వింటున్నాడో అర్థం కాలేదు. అలోక్ ప్రేమను ఎట్లా ఆమోదించాలి? చిన్నతనం నుంచి అలోక్‌ను భర్తగా భావిస్తున్న అవని ఏమవుతుంది? అన్నీ ప్రశ్నలే! ఆలోచించి, తర్జన భర్జనలు పడి "ముందు వెన్నెలవాళ్ళ అభిప్రాయం తెలుసుకొనిరా. వాళ్లు సరే అంటే మీ నాన్నతో మాట్లాడుతాను" అన్నాడు మనసును గట్టి పరుచుకుంటూ మనవడితో.

వెన్నెల చెప్పిన ప్రకారం ఇల్లు వెతుక్కుంటూ వెళ్లాడు అలోక్. కానీ అక్కడ పెద్ద తాళం దర్శనమిచ్చింది. తనని రమ్మని తాళం వేసుకొని ఎటెళ్లారు? ఏం జరిగిందో అర్థం కాలేదు. కాసేపు అటూ ఇటూ తారట్లాడాడు. ఎంతసేపు ఎదురు చూసినా ఎవరూ రాలేదు. చీకటి పడుతుండగా నీరసంగా ఇంటికి వచ్చేసాడు.

ఏమయ్యింది? అన్నట్లుగా చూస్తున్న తాతయ్యకు జవాబివ్వకుండా రూంలోకి వచ్చి పడుకున్నాడు. ఎంత ఆలోచించినా ఏం జరిగిందో తెలియటం లేదు. రోజూ ఏదో ఒక చిలిపి పనితో వచ్చే అవని కనిపించడం లేదు. ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంటోంది. ఎవరూ మాట్లాడటం లేదు. నాలుగు రోజులు భారంగా గడిచిపోయాయి.

"ఇట్లా ఎన్ని రోజులురా? అసలు ఏమి జరిగిందో చెప్పు" గోపాలరావు మనవడిని బుజ్జగింపుగా అడిగాడు.

కళ్లకు అడ్డంగా ఉన్న చేయిని తీయకుండానే "తెలియదు తాతయ్యా, ఏమీ చెప్పలేదు. ఇంటికి తాళం వేసి ఉంది" అన్నాడు భారంగా.

"ఒకసారి మెయిల్ చెక్ చేయకపోయావా?" అన్నాడు గోపాలరావు.

మంచం మీద నుంచి గబుక్కున లేచి "నాకే ఆలోచన రాలేదు తాతయ్యా" అంటూనే మెయిల్ ఓపెన్ చేసాడు.



"వాళ్లది సాంప్రదాయమైన కుటుంబం. మన అలవాట్లు, వాళ్ల అలవాట్లు వేరు. మనం నాన్ వెజిటేరియన్స్ మి. నువ్వు శాకాహారం తినగలవా? అతను అమెరికాకు వెళ్లేందుకు ఇష్టపడటం లేదన్నావు. మరి నువ్వు ఆ కుటుంబంలో ఇమడగలవా? ఇలా నాకు చాలా ప్రశ్నలు వేసారు మా డాడీ, మమ్మీలు. వాళ్లు ఎంత మాత్రమూ మన పెళ్లికి ఒప్పుకోవడటం లేదు. బెంగళూరు తీసుకొచ్చారు నన్ను. మా డాడీ ఫ్రెండ్‌కొడుకుతో నా పెళ్లి నిశ్చయించారు. ఈ నెలాఖరున నా పెళ్లి" అన్న వెన్నెల మెయిల్ చూసి నిశ్చేష్టుడైపోయాడు అలోక్.

కాగల కార్యం గంధర్వులే తీర్చారని మనసులో సంతోషపడుతూ మనవడిని వదలి బయటకు వెళ్లాడు గోపాలరావు.

శివరాణి, వాణికి ఈ విషయం చెప్పి "వాడిని అట్లా వదిలేయండి. ఎవరూ ఏమీ అడగకండి" అన్నారు.

.......

"అవి నిద్రమాత్రలు కావు. పని చేయవు. ఇవిగో.. ఇవి నిద్ర మాత్రలు. ఓ పది వేసుకున్నావంటే డైరెక్ట్‌గా వెళ్లిపోవచ్చు" చేతిలోని టాబ్లెట్స్‌ను నోట్లో వేసుకోబోతున్న అలోక్ ఉలిక్కిపడి తలెత్తి చూసాడు.

ఎదురుగా తాతయ్య.. చేతిలో మందుమాత్రల సీసాతో ఉన్నాడు.

చేతిలోని మాత్రలు పడేసి "తాతయ్యా" అంటూ తాతయ్యను చుట్టుకుపోయి బావురుమన్నాడు.

"నాకు తెలుసురా.. నువ్విలాంటి పని చేస్తావని. అందుకే నిద్రమాత్రలు తీసేసి విటమిన్ మాత్రలు వేసాను అందులో. అందరం నిన్ను కనిపెట్టుకొని ఉన్నాం. అటు చూడు.. మీ అమ్మా నాన్నా నీ కోసం ఎంత బాధ పడుతున్నారో" అన్నాడు గోపాలరావు.

శివరావు, వాణీ కళ్లనీళ్లతో లోపలికి వచ్చి అలోక్‌ను దగరికి తీసుకున్నారు "కన్నా! నీ కోసం బతికే మా గురించి ఒక్క నిమిషమైనా ఆలోచించలేదా? నిన్ను కాదని వెళ్లిపోయిన ఆ అమ్మాయి కోసం ప్రాణం తీసుకుంటావా?" కన్నీటితో అంది వాణి.

ఏమీ జవాబు చెప్పలేక తల్లి చేతిలో మొహం దాచుకున్నాడు.

మనవడి పక్కన కూర్చొని ఆప్యాయంగా తల నిమురుతూ "అన్ని సమస్యలకూ పరిష్కారం ఆత్మహత్య కాదురా! యాభై సంవత్సరాలు ఒకటిగా బతికిన మీ బామ్మ పోగానే నేను ఆత్మహత్య చేసుకున్నానా? అంతే! జీవితంలోని ఆటుపోట్లను తట్టుకుంటూ కాలంతో పాటు మనమూ సాగిపోవాలి, ఆగిపోకూడదు" అన్నారు.

**"ఏమిటీ అల్లరి?" చిరాగ్గా అన్నాడు అలోక్.**

**"బావవు కదా! నీ దగ్గర కాకపోతే ఇంకెక్కడ అల్లరి చేస్తాను. పోనీ నన్ను పెళ్లి చేసుకో, అల్లరి మానేస్తాను" అని జవాబిచ్చింది.**

"కాలంతో పాటు కదలాలి అంటే కాలం కదలటమే లేదు, ఆగిపోయింది. బాధ మర్చిపోలేకుండా ఉన్నాను. ఎంత కాలమని ఇట్లా బతకాలి తాతయ్యా?" దిగులుగా అన్నాడు అలోక్.

"కాలం ఆగిపోలేదురా. దాని మానాన అది కదులుతూ, దాని ధర్మం అది నిర్వహిస్తూనే ఉంది. మనమూ దానితో పాటు కదలాలి. ఒకే చోట ఆగిపోకూడదు. కాలమే అన్ని గాయాలను మాన్పుతుంది. నీ కోసం, నీ వాళ్ల కోసం మనసును కుదుట పర్చుకోవాలి" అన్నారు గోపాలరావు అనునయంగా.

"ఊరికే ఆలోచనలతో కూర్చోకు. పోస్ట్ గ్రాడ్యుయేషన్‌కు అప్లై చేయి. లేదా ఏదైనా ఉద్యోగంలో చేరు. కొంచెం కుదుటపడతావు" అన్నాడు శివరావు.

.......

డాబా మీద కూర్చొని లాప్ టాప్‌లో ఏదో చూసుకుంటున్న అలోక్ వెనుక నీళ్లు పడి వెనకంతా తడిసిపోయింది. ఈ నీళ్లెక్కడివా అని తిరిగి చూస్తే అవని చేతిలో బకెట్‌తో నవ్వుతూ కనిపించింది.

"ఏమిటీ అల్లరి?" చిరాగ్గా అన్నాడు అలోక్.

"బావవు కదా నీ దగ్గర కాకపోతే ఇంకెక్కడ అల్లరి చేస్తాను. పోనీ నన్ను పెళ్లి చేసుకో, అల్లరి మానేస్తాను" అని జవాబిచ్చింది చిలిపిగా.

అవని వైపు సాలోచనగా చూస్తూ "నన్ను పెళ్లి చేసుకుంటావా అవనీ? నేను మరో అమ్మాయిని ప్రేమించి, విఫలమై ఆత్మహత్య చేసుకోబోయాను కదా! మరి దానిని క్షమిస్తావా?" అడిగాడు.

"పో బావా! ఆమెవరో కష్టసఖి మధ్యలో వచ్చింది, మధ్యలో పోయింది. నీ ఇష్టసఖిని నేనే కదా! నా పేరే అవని. భూమాతలా అలోక్ పొరపాట్లను క్షమించి, భరిస్తానులే" చిలిపిగా నవ్వేసింది.

"కానీ నేను ఇంకో మూడేళ్లదాకా పెళ్లి చేసుకోను. క్లినికల్ సైకాలజీ కోర్స్ చేసి, క్లినిక్ పెట్టుకోవాలనుకుంటున్నాను. ప్రేమలో విఫలమై, పరీక్షల్లో ఫెయిలై, జీవితంలో ఎదురయ్యే కష్టాలను ఎదుర్కోలేక అమ్మ కొట్టిందనో, ఏదో ఒక రకంగా క్షణికావేశంలో ఆత్మహత్యా ప్రయత్నం చేసుకునేవారికి కౌన్సెలింగ్ ఇవ్వాలని, కాలేజీలకు, స్కూల్స్‌కు వెళ్లి పరీక్షల ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలో చెప్పాలని ఇలా చాలా ప్లాన్లు ఉన్నాయి. అవన్నీ అమలులోకి రావాలంటే కనీసం మూడు సంవత్సరాల కాలం పడుతుంది. మరి నువ్వు అంత కాలం ఆగగలవా?" అడిగాడు.

"ఇంత కాలం నీ కోసం ఆగిన దానిని ఇంకొంత కాలం ఆగలేనా బావా? మనకు కాలంతో పనేముంది. కానీ బిటెక్ చదివిన నువ్వు క్లినికల్ సైకాలజీలోకి ఎలా వెళతావు?" కుతూహలంగా ప్రశ్నించింది.

"బిటెక్ చేసాక కూడా క్లినికల్ సైకాలజీలో డిప్లొమా, ఆ తరువాత పోస్ట్ గ్రాడ్యుయేషన్, పిహెచ్‌డీ చేయవచ్చు. అమెరికాలో చాలా యూనివర్సిటీలలో ఆ కోర్సులు ఉన్నాయి. మన ఇండియాలో కూడా అలా చేసే అవకాశం ఉన్న కాలేజీలు ఎక్కడన్నా ఉన్నాయా? అని చూస్తున్నాను. ఒకవేళ ఇక్కడ లేకపోయినా అమెరికా వెళ్ళి అయినా చేస్తాను. తిరిగి వచ్చి, ఇక్కడే క్లినిక్ పెడతాను" అన్నాడు దృఢంగా.

.......

"అబ్బా! ఈ కాలానికి ఎందుకింత తొందర? కొంతసేపు ఆగిపోవచ్చుగా!" హనీమూన్ తొందరగా అయిపోయిందని అలుకగా విమానం కిటికీలోంచి సూర్యుడిని చూస్తూ అన్నాడు అలోక్.

"కొంత కాలం క్రితం కాలం ఆగిపోయిందని దిగులు పడ్డట్లున్నావు. ఇప్పుడేమో కాలం ఆగిపోలేదని దిగులు పడుతున్నావా?" అంటూ కిలకిలా నవ్వింది అవని.

# మూడు బొమ్మలు

అనగనగా ఒక రాజు. ఆయన మేధస్సు అపారం. సాధారణంగా రాజులకు ఏమైనా సందేహాలు వస్తే పెద్దలను, పండితులను పిలిపించి తమకొచ్చిన సందేహాలను చెప్పి వాటికి సమాధానాలు తెలుసుకుంటూ ఉంటారు. కానీ ఇక్కడ అలా కాదు. ఇతరులకు సందేహాలు వస్తే రాజు దగ్గరకు వచ్చి తమకు కలిగిన సందేహాలను చెప్పి, వాటికి జవాబులు తెలుసుకునేవారు. అంటే ఆ రాజు ఎంత తెలివైనవాడో అర్థం చేసుకోవచ్చు.

ఓ రోజు ఓ పెద్దాయన రాజు దగ్గరకు వచ్చాడు.

ఆయన చేతిలో మూడు బొమ్మలు ఉన్నాయి.

ఆ మూడు బొమ్మలూ ఒకేలా ఉన్నాయి. చూసీ చూడటంతోనే వాటిలో ఎలాంటి తేడాలు కనిపించవు. అంటే అవి ఒకేలా ఉన్నాయన్నమాట.

ఆ పెద్దాయన చేతిలో ఉన్న బొమ్మలను రాజు చూశాడు. "ఎక్కడివవి?" అని అడిగాడు.

అప్పుడు ఆ పెద్దాయన "నాకు తెలిసిన ఒక వ్యక్తిని మూడు బొమ్మలు తయారు చేసివ్వమని అడిగాను. అతను చాలా తెలివైనవాడు. అతనే ఈ మూడు బొమ్మలను చేశాడు. అవి బాగున్నాయి. కానీ చిక్కేమిటంటే" అని ఆ పెద్దాయన ఏదో చెప్తుండగా రాజు జోక్యం చేసుకుని "ఏమిటి సమస్య?" అని అడిగాడు.



"నేను అతనిని మూడు రకాల బొమ్మలు అడిగాను. అతనేమో మూడింటినీ ఒకేలా చేసిచ్చాడు" అన్నాడు పెద్దాయన.

"ఏమిటిలా చేసిచ్చావని అతని నుంచి బొమ్మలు తీసుకుంటున్నప్పుడే అడగాల్సింది కదా" అని అన్నాడు రాజు.

"రాజా, మీరు చెప్పినట్టే అడిగాను. అయితే అతను ఏం చెప్తున్నాడంటే ఈ మూడు బొమ్మలూ వేర్వేరు. చూడటానికి ఒకేలా అనిపిస్తాయే తప్ప మూడూ మూడు రకాలన్నాడు, వాటిలో తేడాలున్నాయి, చూసుకో!" అన్నాడండి.

"కానీ నేను వాటిని ఎంత తీక్షణంగా చూసినా ఆ తేడాలేమిటో నాకు కనిపించడం లేదు" అన్నాడు పెద్దాయన.

"నీ పరిచయస్తుడు చెప్పింది నిజమే. మూడు బొమ్మలూ వేర్వేరుగా ఉన్నాయి. ఇదిగో.. ఈ మొదటి బొమ్మ ఉంది చూసావూ.. ఇది ఉత్తమమైన స్నేహితుడిలాంటి బొమ్మ. ఇక రెండో బొమ్మ మధ్యస్థంగా ఉండే మిత్రుడి తీరుకి సరైన ఉదాహరణ. ఇక మూడో బొమ్మ ఉంది చూసావూ.. అది అధముడికి సరైనది" అని పెద్దాయన వైపు చూసాడు.

"ఏమిటి! అర్థమైందా?" అన్నాడు రాజు.

కానీ పెద్దాయన రాజు వంక అయోమయంగా చూశాడు.

"నాకేమీ బోధపడలేదండీ" అన్నాడు పెద్దాయన. రాజు వంక అయోమయంగా చూశాడు.

అప్పుడు రాజు ఇలా విడమరిచి చెప్పాడు.. ఈ మూడు బొమ్మలు అక్కడున్న ఓ బల్ల మీద ఉంచాడు. ఓ సన్నని పుల్లను తీసుకున్నారు. ఆ సన్నని పుల్లను మొదటి బొమ్మ చెవిలో దూర్చారు. అది కొంత దూరం వరకే లోపలికి వెళ్లి అక్కడ ఆగిపోయింది.

ఆ తర్వాత రెండో బొమ్మ చెవిలో ఆ పుల్లను పెడితే అది నోట్లోంచి బయటకు వచ్చింది. ఇక మూడో బొమ్మ చెవిలో పుల్లను పెట్టాడు. ఆ పుల్ల కాస్తా సరాసరి అవతలి చెవిలోంచి బయటకు వచ్చింది. మొదటి రకం ఉంది చూసావూ, అలాంటి మిత్రులు ఎలాంటి వారంటే– మన కష్టాన్ని వారితో చెప్తే ఏమీ చెప్పకుండా మనం చెప్పినదంతా వింటారు. ఆ మాటలను ఇంకెవరితోనూ చెప్పరు. అంతేకాదు, మరెవరికీ తెలియకుండా మనకు సాయం చేస్తారు. చేసిన సాయం గురించి కూడా ఎవరికీ చెప్పరు. చెప్పడానికి అస్సలు ఇష్టపడరు. అలాగే మొదటి బొమ్మ చెవిలో పెట్టిన పుల్ల సగం వరకే పోయి అక్కడితో ఆగిపోయింది.

రెండో బొమ్మలో పుల్ల చెవి గుండా వెళ్లి నోటి గుండా బయటకు వచ్చింది. ఇలాంటి మిత్రులు రెండో రకంవారు. మనం మనకున్న కష్టాన్ని చెప్తే వారు ఆ కష్టాన్నంతా విని అవతలకు వెళ్లి నలుగురికీ చెప్తారు, అంతేకాదు మన కోసం సాయం అడుగుతారు. మనకంటూ సాయం అడిగి తీసుకుని మనకిస్తారు. వీరు మధ్యస్తులు.

మూడో రకం బొమ్మ ఉంది చూసావూ.. అందులో ఒక చెవిలో పెట్టిన పుల్ల మరొక చెవిలోంచి ఇవతలకు తిన్నగా వచ్చేసింది. అంటే ఇలాంటి బొమ్మ ఎలాంటి రకానికి గుర్తంటే– మన కష్టాన్ని చెప్తే చెప్పినదంతా విన్నట్టు నటిస్తారు. మరొక చెవి ద్వారా ఆ మాటల్ని వదిలేస్తారు. అస్సలు మన కష్టం గురించి చెప్పుకున్న మాటలను పట్టించుకోరు. దిగులుపడరు. వీరు అధములు. మూడు బొమ్మల్లో ఉన్న తేడాలివే!" అన్నాడు రాజు.

.......

చదువుతున్న పిల్లల్లోనూ మూడు రకాలవాళ్లు ఉంటారు. కొందరు చెవితో విని మనసులో నమోదయ్యేలా చూసుకుంటారు. కొందరు చెవితో విని పెన్నుతో రాస్తారు. కొందరు ఒక చెవితో వింటారు. మరొక చెవితో వదిలేస్తారు.

క్లాసులో ఓ గురువుగారు పాఠం చెప్తుంటే ఒక కుర్రాడు తలను అటూ ఇటూ వేగంగా తిప్పుతూ వింటాడు.

ఎందుకురా అలా తలను ఊపేస్తున్నావు? అని అడిగాడు పక్కనున్నవాడు.

అప్పుడు ఆ కుర్రాడు తలను అటూ ఇటూ ఊపుతూనే ఓ చెవిలోంచి వెళ్లే పాఠం మరొక చెవిలోంచి బయటకు వచ్చేస్తోంది. లేకుంటే అవన్నీ లోపల ఉండిపోతే మెదడేమయ్యేది. ఆ భారాన్ని నేను భరించలేను" అన్నాడు.

**- యామిజాల జగదీశ్**

# పీడితుల వెతలు-రా.వి.శాస్త్రి

**తెలుగు సాహిత్యంలో గురజాడవారి 'కన్యాశుల్కం' స్వాతంత్ర్యానంతరం కథా రచయితలకు నాటి సామాజిక ఆర్థిక స్థితిగతులను వాస్తవికత ప్రతిబింబించే రచనలు రాయడానికి క్రమేపీ నవ చైతన్యం అందించింది.**

**గురజాడ, గిడుగు, శ్రీశ్రీ నవ్యాంధ్ర సాహిత్య వైతాళికులుగా సృష్టించిన అభ్యుదయం, డికెన్స్, గోర్కీల పాశ్చాత్య రచనల ప్రభావం తెలుగు కథ, నవలను మలుపు తిప్పింది.**

సమాజపు అట్టడుగు దీనుల జీవితాల చీకటి కోణాలను స్పృశించి సామాన్య కష్టజీవులు కథానాయకులుగా చిత్రించే కథలు, నవలలతో ఉత్తరాంధ్ర సాహితీసీమ, కొత్త వెలుగు సృష్టించింది. 1939 నుంచి సుమారు 3 దశాబ్దాలు పైగా తెలుగు కథ, నవల, నాటకం సాహితీ క్షేత్రంలో అపూర్వమైన నవ్య, రమ్యశైలి, నూతన భావావేశం ప్రజ్వరిల్లచేసిన రాచకొండ విశ్వనాథ శాస్త్రి 'రావిశాస్త్రి'గా నిరుపేదల జీవన వేదనను, మానవతా వెలుగుతో ప్రసరింపచేసిన మహా రచయితగా జీవించారు.





'అల్పజీవి'గా, 1953 భారతిలో నాలుగు నెలల పాటు ప్రచురింపబడిన రావిశాస్త్రి నవల, కొత్త భావుకత, సామాజిక స్పృహ, బాధిత జనావళి గాథలకు కొత్త ఊపిరి అందించింది. నేటికీ 'పిపీలికం' లాంటి రావిశాస్త్రి కథలు చదువుతుంటే కొత్త అర్థాలు స్ఫురిస్తాయి. 'ఆకలిచూపు' ఎంత శక్తివంతమైనదో, జన్మరాహిత్యం మోక్షం వంటి వేదాంత ధోరణులు ఎంత అర్థహీనమైనవో స్పష్టమవుతుంది.

నిత్య జీవితంలో న్యాయవాదిగా, కష్టజీవులు నిస్సహాయంగా ఎదుర్కొంటున్న దోపిడీ వ్యవస్థపై తిరగబడి, పెట్టుబడిదారీ గర్భంలోంచి సామ్యవాదం చీల్చుకు వస్తుందనే ప్రగాఢ విశ్వాసం రావిశాస్త్రి రచనలలో మార్గం చూపిస్తుంది. విశాఖ మాండలీకంలోని పలుకుబడి సంభాషణలతో, సృష్టించిన పాత్రలు కథలను నడిపించి జీవిత సంక్షోభానికి మార్గం చూపిస్తాయి.

1922 జులై 30న జన్మించి, 1993 నవంబరు 10న కన్ను మూసిన రాచకొండ విశ్వనాథ శాస్త్రి ఆరు సంపుటాలు, అరవై పైగా కథలు, నవలలు రచించారు. కథా సాగరం, ఆరు సారా కథలు, రత్తాలు-రాంబాబు, సొమ్ములు పోనాయండి, ఇల్లు, బంగారం, రాచకొండ కథలు, నాటకాలు, రాజు మహిషి, కలకంఠి, బానిస కథలు, రుక్కులు 1952 నుండి 1975 వరకు తెలుగు సాహిత్యాన్ని ఆధునిక జీవన దర్పణాలుగా అభ్యుదయం నుంచి విప్లవం వైపు ఆలోచింపచేస్తాయి. జీవితంలో నడిచొచ్చే మనుషులు, జీవంతో తొణికిసలాడే అభాగ్యులు, జీవితేచ్ఛ వదులుకోలేని నిస్సహాయ నిర్భాగ్యులు చదువరులను నిలదీస్తారు.

'రత్తాలు-రాంబాబు' అసంపూర్తి నవలలో కాచి వడపోసిన జీవిత సత్యాలు ప్రశ్నిస్తాయి. "పైనలున్నోడిదే రాజ్జం అని పెతి నా కొడుకూ సెప్పే నా కొడుకేగానీ, ఆళ్ళని దింపే నా కొడుకు అవుపిచ్చడు. ఆళ్ళని దింపడమెలాగో సెప్పే నా కొడుకూ అవుపిచ్చడు" "కుక్క కాటుకి మందుంటదిరా. మరింక పోలీసోడి కాటుకి మందెక్కడిదిరా".

ఇటువంటి సూక్తులు 'రత్తాలు-రాంబాబు' నవలలో కోకొల్లలు. ఒకసారి చదివి, నవ్వుకొని మరిచిపోగలిగినవి కాదు. కలకాలం వెంటబడి వేధిస్తాయి. రావిశాస్త్రి ప్రతిభకు జోహార్లు చెయ్యకుండా వుండలేం. "నూటికి డెబ్భై మందికి గంజినీళ్ల దొరకనప్పుడు యీ నరసమ్మ కంపెనీలో వయసు పిల్లలకి బిరియానీ భోజనం, బ్రాందీ పానీయం.. అమరసుఖాలు. మరింక ముండపాపలు, మూణ్ణాళ్ళే బతుకుతారంటే అందుకు తప్పు పట్టే ముష్టి సచ్చినోళ్ళెవరుంటారు". "ఒనర్లు చిరకాలం బతుకుతారు. అధికార్లు కలకాలం వర్ధిల్లుతారు" రావిశాస్త్రి పరోక్షంగా పాఠకులను చీవాట్లు పెడ్తారు. గుండెల మీద గుద్ది నిలబెట్టి కథాకదన శైలిలో పట్టపగటి చీకటి పాపాన్ని ఆదరించే సమాజాన్ని, తప్పుకు తిరిగే బుద్ధిజీవులను పాఠకుల ముందు నిలబెట్టారు.



ప్రస్తుత వర్తమాన జీవన పరిస్థితులు అనేక కోణాలలో క్రూరంగా, వికృతంగా, అమానవీయంగా రాజ్యం చేస్తున్నాయి. ఉబుసుపోక సాహిత్యం ఊళ్ళేలుతోంది. కృత్రిమ స్వార్థం విలయ తాండవం చేస్తోంది. రాజకీయం రంకెలు వేస్తోంది.

మళ్ళీ మళ్ళీ చదివించి, ఇంకోసారి చదివితే బావుణ్ణనిపించే 'ఆరు సారా కథలు' రావిశాస్త్రి లాంటి వారి ప్రతిభకు తార్కాణంగా సాహిత్యంలో స్మరణీయంగా నిలిచిపోతాయి. పతితులు, భ్రష్టులు, బాధాసర్పదష్టులు రావిశాస్త్రిని వెతుక్కుంటూ వస్తూనే ఉంటారు. వారికి వకాల్తా పట్టే వకీలు, రచయితగా కొండంత అండ రాచకొండ. ఇది జగమెరిగిన సత్యం అన్నారు చలసాని ప్రసాద్.

**- జయసూర్య**

సింగిల్ పేజీ కథ

# కొత్త రకం పోకడ

"ఎక్కడికెళ్లాలి సార్?" అడిగాడు ఆటోడ్రైవర్, శేఖరం పక్కగా ఆటోని ఆపుతూ.

"రైల్వే స్టేషన్‌కి వెళ్లాలి, ఎంత తీసుకుంటావ్?" అడిగాడు శేఖరం.

"ఎక్కండి సార్, మీరే ఏదో చూసి ఇవ్వండి" అన్నాడు వినయంగా.

"ఏదో చూసి ఇవ్వడం ఎందుకు? మీటరే చూసి ఇస్తాలే" అన్నాడు.

"రైల్వే స్టేషన్‌కి ఎంత తీసుకుంటావో సూటిగా చెప్పు. ఇలా నాంచకు. నేను ఎక్కువసేపు నుంచోలేను" చెప్పాడు.

"ఎంతంటే?" అని ఓ క్షణం పైకి చూసి ఆలోచించి "సరే సార్! ఓ నూట ఎనభై రూపాయలు ఇవ్వండి".

"మరీ అంతా, అంతెందుకయ్యా? నా స్నేహితుడు నేను వచ్చేముందు మరీ మరీ చెప్పాడు మహా అయితే తొంభై రూపాయలు లేదా వంద రూపాయలు ఇస్తే చాలన్నాడు.

"నూట యాభై అయినా ఇవ్వండి సార్. ఎందుకంటే రైల్వే స్టేషన్ దారిలో సిగ్నల్స్ ఎక్కువ, ట్రాఫిక్ బాగానే ఉంటుంది. ఆగి, ఆగి ఆటోని ఎద్దుల బండిలా నెమ్మదిగా నడుపుతూ పోవాలి. కనుక మీరే ఆలోచించాలి" అన్నాడు.

"నూట ముప్పై రూపాయలు ఇస్తాను. నీకు ఇష్టమైతే రా. కష్టం అయితే నీ ఇష్టం" అన్నాడు ముందుకి నడిచేయబోతూ.

ఆటో డ్రైవర్ బుర్ర గోక్కుని "సరే సార్, మీదే బోణీబేరం, ఎక్కండి" అన్నాడు కొరికేసేలా చూస్తూ.

"నాకు తెలుసురా పిల్లకాకి, నా దగ్గరా నీ వేషాలు? ఊరికే డబ్బు గుంజేద్దామనే, అమ్మా" అని మనసులో అనుకుని గర్వంగా ఆటోలో కూర్చుని "పోనీ" అన్నాడు.

ఆటో డ్రైవరు చిన్నగా నవ్వుతూ "మీరు చాలా తెలివైన వ్యక్తిలా కనిపిస్తున్నారు" "దిగేటప్పుడు ఏ పదో ఇరవయ్యో ఎక్కువిస్తానని ఇలా నన్ను పొగిడేసి మునగచెట్టు ఎక్కిస్తున్నావా?" అడిగాడు అనుమానంగా చూస్తూ.

"మీరు భలేవారు సార్? అంత కరెక్టుగా ఎలా చెప్పారు. మీరు ఆటో ఎక్కేముందు ఆచి తూచి బేరం ఆడారు. అలాగే మీరు ఆటో ఎక్కే ముందే రైల్వే స్టేషన్‌కి ఎంత తీసుకుంటారు లాంటివి.. అన్నీ చాలా పకడ్బందీగా తెలుసుకున్నారు. అందుకే మీరు నా కంటికి తెలివైన వ్యక్తిలా కనిపించారు" చెప్పాడతను.

"ఆ విషయం నాకు ఎప్పుడో తెలుసు. అందరూ అంటుంటారు కూడా. ఆ మాత్రం తెలివి లేకుండా ఉంటే అందరూ మనల్ని ఫూల్‌ని చేసి ఆడుకుంటారు తెలుసా?" అన్నాడు కాస్త గర్వంగా.

ఆటో అలా కొంత దూరం ప్రయాణించాక సడన్‌గా డుబక్, డుబక్ అంటూ రెండు జెర్కులు ఇచ్చి, ఇచ్చి ఆటో ఆగిపోయింది.

ఆటో డ్రైవర్ శేఖరం వంక చాలా కోపంగా చూస్తూ "ఇతను ఎక్కిన వేళా విశేషం" అని అతనికి వినబడేలా నసుగుతూ ఇంజిన్ చెక్ చేసాడు. మళ్ళీ మళ్లీ స్టార్ట్ చేసాడు. ఆటో స్టార్ట్ అయినట్టే అయ్యి మళ్లీ ఆగిపోయింది. దిగి మళ్లీ చూసాడు. ఆటో అలానే స్టార్ట్ అవుతూ అవుతూనే ఆగిపోతోంది.

తరువాత కాస్త విసుగ్గా "సార్, ఆటో రిపేర్. ఏమైందో తెలియడం లేదు. మెకానిక్ వచ్చి చూడాల్సిందే. కనుక మీరు వేరే ఆటో ఎక్కడం నయం సార్" అంటూ అటుగా వెళ్తున్న ఓ ఆటో ఆపి "సార్, ఈ ఆటో ఎక్కి వెళ్లిపోండి. నా ఆటో తోసుకుంటూ పోవాలి, లేదా నేనే వెళ్లి మెకానిక్‌ని తీసుకొచ్చి చూపించాలి. ఇతనికి ఓ యాభై ఇవ్వండి స్టేషన్ దగ్గర దించేస్తాడు. లేదా వెయిట్ చేయండి. నా ఆటో బాగయ్యాక నేనే మిమ్మల్ని దించేస్తాను" చెప్పాడు.

"ఏం వద్దులే. నీ టైం బాలేదూ, నా టైం కూడా బాలేదు. నేను ఈ ఆటో మీద వెళ్తాను" అని ఆ వచ్చిన ఆటోలో ఎక్కి కూర్చున్నాడు. ఆటో ముందుకు కదిలింది.

"అప్పటివరకూ పంచకళ్యాణి గుఱ్ఱంలా పరిగెట్టిన ఆటో ఉన్నట్టుండి ఒక్కసారి గుండ్రాయిలా ఓ చోట స్థిరంగా ఆగిపోయింది. పాపం.. ఇప్పుడు అతను ఆ ఆటోని ఎలా నెట్టుకుంటూ వెళతాడో కదా!" అని వెనక్కి తిరిగి చూసాడు.

ఎంచక్కా ఆటో స్టార్ట్ చేసుకుని యూ టర్న్ చేసుకుంటున్నాడతను. అది చూసి నోరెళ్లబెట్టి "రిపేర్ అయిన ఆటో స్టార్ట్ అయిందయ్యా. ఛ.. ఛ.. నేనే అనవసరంగా తొందరపడి నీ ఆటో ఎక్కాను. ఇంకొంచెంసేపు వేచి చూసి వుంటే నాకు యాభై రూపాయలు మిగిలేవి" అన్నాడు నెత్తి కొట్టుకుంటూ.

> "ఏదో చూసి ఇవ్వడం ఎందుకు? మీటరే చూసి ఇస్తాలే" అన్నాడు. "రైల్వే స్టేషన్‌కి ఎంత తీసుకుంటావో సూటిగా సుత్తి లేకుండా చెప్పు ఎక్కువసేపు నుంచోలేను" చెప్పాడు అసహనంగా.

"అది మీ పొరపాటు కాదు సార్, అదంతే. దానికో లెక్కుంది. అదో కొత్త రకం పోకడ లెండి" అన్నాడు ముసి ముసిగా నవ్వుతూ.

"అంటే?" అడిగాడు శేఖరం బుర్ర గోక్కుని అయోమయంగా చూస్తూ.

"ఏముంది సార్, రూపాయికి రూపాయి మిగలాలనే అత్యాశతో బేరం ఒప్పుకున్నట్టే ఒప్పుకుని రైల్వే స్టేషన్ ఇంకా కొంత దూరం ఉందనగా ఆటో రిపేర్ అని ఆపేస్తారు. దాంతో సగం ఖర్చయ్యే డీజిల్‌కి, ఇంచుమించు రెట్టింపు సొమ్ము చేసుకుంటారు. అతను మిమ్మల్ని బాగా పొగిడేసి డబ్బులు ముందే ఇచ్చేయమనుంటాడు" అతని మాట పూర్తి చేయకుండానే–

"ఔనయ్యా! డీజిల్ కొట్టిస్తా" అంటూ ముందే డబ్బులు అడిగి తీసేసుకున్నాడు" చెప్పాడు శేఖర్ బిక్క మొహంతో బుర్ర గోక్కుంటూ.

"నాకు తెలుసు సార్, అలా ఆటో రిపేరు అని ఆపేసాక– మెకానిక్ వచ్చేస్తాడు, వెయిట్ చేయమంటారు లేదా వేరే ఆటో పట్టుకోమంటారు. సమయానికి వెళ్లకపోతే అవతల ఎక్కాల్సిన రైలు వెళ్లిపోతుంది. కనుక ఇక అతన్ని మిగిలిన డబ్బులూ గట్రా అడక్కుండా వేరే ఆటో ఎక్కుతారు. ఇది రైల్వే స్టేషన్ వెళ్లేవారిని, కొందరు ఆటో డ్రైవర్లు చేసే ఒక రకం మోసం లెండి" అని చెప్తుండగానే శేఖరం బుర్ర తిరిగిపోయింది. ఓ క్షణం తర్వాత తేరుకుని "ఈ ఆటో అయినా స్టేషన్ వరకు వెళ్తుందా?" అని అనుకుంటుండగానే ఆటో ఓ జెర్క్ ఇచ్చి ఆగిపోయింది.


శేఖరం గుండె గుబేలుమంది.

ఆ ఆటో డ్రైవర్ వెనక్కి తిరిగి "కంగారు పడకండి సార్, సిగ్నల్ పడింది" అని చిరునవ్వుతో చెప్పాడు.

శేఖరం కూడా మనసు తేలిక పడ్డట్టు చిన్నగా నవ్వేసాడు.

# కన్నీటి బిందువు ఆకారంలో శ్రీలంక

భారతదేశానికి దక్షిణాన హిందూ మహాసముద్రంలో నెలకొని ఉన్న చిన్న ద్వీప దేశం శ్రీలంక. పాక్ జలసంధి, గల్ఫ్ ఆఫ్ మన్నార్ ద్వారా ఏర్పడిన ఇరుకైన సముద్రం ద్వారా శ్రీలంక భారతదేశం నుండి వేరుచేయబడింది. ఒకప్పుడు దీన్ని సిలోన్, సింహళదేశం అని పిలిచేవారు. తన సహజ సౌందర్యం, సముద్ర జలాల మధ్య ఉండటం వల్ల 'హిందూ మహాసముద్రం యొక్క ముత్యం' అని సార్థక నామమేర్పడింది. భారతదేశం, మాల్దీవులతో అంతర్జాతీయ నీటి సరిహద్దులను పంచుకున్న శ్రీలంక ఆసియాలోని ఒక ద్వీప దేశం. ఇక్కడ అందమైన బీచ్‌లతో పాటు పర్యాటకుల్ని విశేషంగా ఆకర్షించే పర్యాటక ప్రదేశాలు చాలా ఉన్నాయి. ప్రపంచంలో అత్యంత అందమైన ద్వీప దేశాల్లో ఒకటైన శ్రీలంక అద్భుతమైన బీచ్‌లు రమ్య మనోహరమైన ప్రకృతి దృశ్యాలు, అందమైన జలపాతాలు, పచ్చని అడవులకు నెలవై, రామాయణ గాథలతో ముడిపడి ఉంది. దీంతో శ్రీలంక భారతీయుల హృదయాలను సైతం తాకింది. అది మన పొరుగు దేశమే కావడంతో చాలా మంది పర్యాటకులు వెళ్లడానికి ఆసక్తి చూపుతుంటారు. సూర్యోదయం, సూర్యాస్తమయం సమయాలలో రమణీయ ప్రకృతిని పర్యాటకులు ఆస్వాదించి ప్రశాంతత పొందుతారు. 'ప్రపంచంలోని అత్యుత్తమ దీవులలో శ్రీలంక కూడా ఒకటి' అని మార్కోపోలో పేర్కొన్నారు. సుదీర్ఘ చరిత్ర కలిగిన చిన్న దేశమైనప్పటికీ, అక్కడ ఆస్వాదించడానికి చాలా ప్రకృతి సౌందర్యంలో ఇమిడిపోయిన పర్యాటక ప్రదేశాలు ఉన్నాయి. శ్రీలంకలోని దాదాపు ఎనిమిది పర్యాటక ప్రదేశాలను యునెస్కోవారు ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించడం విశేషం. వీటిని తిలకించడానికి ప్రపంచ పర్యాటకులు అనునిత్యం ఇక్కడికి వస్తుంటారు.



## కొలంబో

శ్రీలంక పశ్చిమ తీరంలో ఉన్న నగరం కొలంబో. శ్రీలంక రాజధాని నగరమైన కొలంబో సైతం మంచి పర్యాటక ప్రదేశం. ఇది ఆ దేశంలోనే అతిపెద్ద నగరం కావడంతో పాటు అధిక జనాభా కలిగిన ప్రదేశం. కొలంబో శ్రీలంకకు పడమర దిక్కున సముద్ర తీర ప్రాంతంలో ఉండటంతో వాణిజ్యం పరంగా 2 వేల ఏళ్ల చరిత్ర కలిగి ఉంది. ఇక్కడ అన్ని వర్గాలవారు ఉంటారు. లంకలోనే చాలా అందమైన నగరంగా తీర ప్రాంత ప్రదేశంగా విశేష గుర్తింపు పొందింది. సముద్రం వెంబడి ఐదు హెక్టార్ల విస్తీర్ణంలో నెలకొని ఉన్న గల్ ఫేస్ గ్రీన్ వద్ద సూర్యాస్తమయం అద్భుతంగా ఉంటుంది. సముద్రం వెంబడి ఉన్న ప్రధాన విహార ప్రదేశం, గాల్ ఫేస్ గ్రీన్‌లో నివాసితులు, పర్యాటకులు బీచ్ క్రికెట్ ఆడుతూ, బీచ్ సైడ్ షాక్స్‌లో భోజనం చేసి ఉల్లాసంగా గడిపే వినోద కేంద్రం అని చెప్పవచ్చు.

కొలంబోలో అనేక ఆకాశహర్మ్యాల నిర్మాణాలు ఉన్నాయి. ఇక్కడ 350 మీటర్ల ఎత్తులో నిర్మించిన లోటస్ టవర్ తప్పక చూడదగిన నిర్మాణం. ఇది ఆసియాలోనే ఎత్తయిన నిర్మాణంగా పరిగణిస్తున్నారు. వైక్కల్ నదిపై డిన్నర్, క్రూయిజ్‌లో ప్రయాణం చేస్తూ సేదతీరవచ్చు. కొలంబోలోని ప్యారడైజ్ రోడ్‌లో శ్రీలంక దేశానికి చెందిన గృహోపకరణాలు, హస్త కళాఖండాలను కొనుగోలు చేయవచ్చు. కొలంబోలో ఆకాశాన్ని తాకుతున్నాయా అన్నట్టుండే అద్భుతమైన బహుళ అంతస్తుల భవనాలు ఉన్నాయి. అనేక ఫైవ్ స్టార్ హోటళ్లు కూడా ఉన్నాయి. బ్రిటిషువారు 1815 నుండి 1948 వరకు ఇక్కడ పాలించారు. దానికి జ్ఞాపకార్థంగా ఇక్కడ ఒక నిర్మాణాన్ని కట్టారు. కొలంబోలో అనేక ప్రాచీన బౌద్ధ ఆలయాలున్నాయి. కొలంబోని జమియల్ అల్ ఫర్ మసీదు అద్భుతమైన శిల్పచాతుర్యంతో కనువిందు చేస్తుంది. ఎరుపు, తెలుపు వర్ణంతో నిర్మించిన ఈ మసీదు నిర్మాణం 1908లో ప్రారంభించి 1909లో పూర్తి చేశారు. ఇక్కడ సుందరమైన చర్చిలు ఉన్నాయి. కొండరాయితో నిర్మించిన ప్రాచీన శివాలయం ఉంది. ఈ ఆలయ శిల్పకళ తమిళనాడు ఆలయాలను పోలి ఉంటుంది. పోర్ట్ నెలకొని ఉన్న ప్రదేశంలో బ్రిటిషువారు నిర్మించిన అనేక భవంతులు ఉన్నాయి.

యాత్రా కథనం

**షేక్ అబ్దుల్ హాకీం జాని**

## క్యాండీ పట్టణం

శ్రీలంకలో ఒక ప్రముఖ పట్టణం క్యాండీ. ఇదంతా కొండ ప్రాంతం. ఇక్కడ నెలకొని ఉన్న శ్రీ దలిదా మాలిగావ్ అనే బౌద్ధ ఆలయం ప్రపంచంలోని అత్యంత పవిత్రమైన బౌద్ధమత క్షేత్రాల్లో ఒకటి. ఇదెంతో పురాతన ఆలయమే కాకుండా మరో ప్రత్యేకత కూడా కలిగి ఉంది. ఈ ఆలయంలో ఉన్న ఒక దంతం గౌతమ బుద్ధునిదని ఇక్కడివారు విశ్వసిస్తారు. ఆ కారణంగా దీన్ని టూత్ రెలిక్ ఆలయం అని కూడా పిలుస్తారు. అందుకే ఈ ఆలయానికి అంత ప్రాముఖ్యత ఉంది. ఇది ప్రముఖ బౌద్ధ యాత్రా స్థలంగా మారింది. ఏడాది పొడవునా ప్రపంచం నలుమూలల నుండి పర్యాటకులు ఇక్కడకు వస్తుంటారు. యునెస్కో దీన్ని ప్రపంచ వారసత్వ ప్రదేశాల్లో చేర్చింది. వలస రాజ్యాల శకానికి క్యాండీ శ్రీలంక సామ్రాజ్య రాజ్యానికి ప్రాథమిక రాజధానిగా ఉండేది.

క్యాండీలో అనేక తేయాకు తోటలు, పర్వతాలతో పాటు నేషనల్ మ్యూజియం ఉంది. ఈ మ్యూజియం సందర్శిస్తే ఇక్కడ చరిత్ర తెలుస్తుంది. క్యాండీలో అంబులువావా క్రేజియస్ట్ టవర్ కచ్చితంగా చూడాల్సిందే.

## ఎల్లా హిల్ స్టేషన్

శ్రీలంక రాజధాని కొలంబోకు రెండు వందల కిలోమీటర్ల దూరంలో ఉండే చిన్న పట్టణం ఎల్లా. ఇది చాలా అందమైన హిల్ స్టేషన్. సముద్ర మట్టానికి 1,041 మీటర్ల ఎత్తులో వుంటే ఈ ప్రదేశం పర్యాటకులను ఆకర్షిస్తుంది. ఈ ప్రాంతం అనేక రకాల చెట్లు, చిరుతల వంటి జంతుజాలానికి నిలయం. జీపుపై ప్రయాణిస్తూ ఈ జాతీయ ఉద్యానవనాన్ని, ఇక్కడి జంతువులను తిలకించవచ్చు. చుట్టూ దట్టమైన అడవులు, చల్లని వాతావరణం, అందమైన మేఘాలు కళ్లముందు కదలాడుతుంటాయి. ఇక్కడ తేయాకు తోటలు కూడా ఉంటాయి. ఎల్లా ప్రాంతంలో కొండ గుహలలో నుండి ఎత్తయిన వంతెన పైగా సాగే రైలు ప్రయాణం అదనపు ఆకర్షణగా ఉంటుంది.

## దంబుల్లా గుహ దేవాలయం

12వ శతాబ్దానికి చిత్రలేఖనాలు, శిల్పాలు ఇక్కడ ఉన్నాయి. సజీవ బౌద్ధ ప్రదేశంగా భాసిల్లుతున్న దంబుల్లా గుహ దేవాలయ ప్రాంతాన్ని యునెస్కోవారు ప్రపంచ వారసత్వ ప్రదేశాల జాబితాలో చేర్చారు. శ్రీలంకలో ఇది ఉత్తమమైన పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతోంది. గొప్ప సంస్కృతి, ఆధ్యాత్మిక, వారసత్వ సంపదగా ఈ ప్రాంతం ప్రశంసలందుకుంది.

## సిగిరియా రాక్ ఫోర్ట్

పర్యాటకులు శ్రీలంకలో మొదటగా చూడాలనుకునే ప్రదేశం సిగిరియా కోట. బండరాయిలా కనిపించే అతి పెద్ద కొండపై ఈ కోటను నిర్మించారు. కొండను ఎక్కడానికి కొన్ని చోట్ల పాలరాతి మెట్లు కూడా ఉన్నాయి. శిథిలమైన కోట అవశేషాలను ఇప్పుడు చూడవచ్చు. కుల వంశానికి చెందిన కసయప్ప అనే మహారాజు ఈ ప్రాంతాన్ని పరిపాలించారని చరిత్ర చెబుతుంది. అంతకుపూర్వం రావణాసురుడు పాలించినట్లు చెబుతుంటారు. అందుకే దీన్ని రావణాసురుడి కోట అని కూడా పిలుస్తున్నారు. ఇక్కడ సింహం ఆకారంలో కొన్ని నిర్మాణాలు ఉండటం వల్ల దీన్ని 'లయన్ రాక్', 'సింహగిరి' అని కూడా పిలుస్తారు. శ్రీలంకలోని ప్రధాన నగరాల్లో ఒకటైన దంబుల్లా పట్టణానికి సమీపంలో ఉండే ఈ పురాతన రాతికోట చూడటానికి అద్భుతంగా ఉంటుంది. 180 మీటర్ల ఎత్తయిన పీఠభూమిపై ఈ చారిత్రక నగరాన్ని నిర్మించారు. చుట్టూ దట్టమైన అడవి, మధ్యలో ఉన్న పెద్ద కొండపై అరుదైన ఈ కోట ఉంటుంది. అది సముద్ర మట్టానికి 349 మీటర్ల ఎత్తులో ఉండటంతో పర్యాటకులు దానిపైకి ఎక్కాలి. దీనిని యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశంగా గుర్తించింది. ఈ కోటను క్రీ.శ.477 నుండి 495 కాలంలో నిర్మించినట్లు తెలుస్తోంది. చెరువులు, తోటలు, ఫౌంటెన్లు అదనపు ఆకర్షణ. 3వ శతాబ్దంలో మఠంగా ఉపయోగించిన రాక్ స్ట్రాంగ్ హోల్డ్‌ను తరువాతి కాలంలో రాజభవనంగా మార్చారు. 14వ శతాబ్దంలో బౌద్ధులు ఈ ప్రదేశంలో నివసించి, ధ్యానం చేసినట్లు ఆధారాలున్నాయి. కొన్ని బౌద్ధ స్థూపాలు ఇప్పటికీ ఇక్కడ ఉన్నాయి. సీతమ్మను అశోక వనంలో రావణాసురుడు పదకొండు నెలల పాటు బంధించాడని పేర్కొన్న ప్రదేశంలో సీతమ్మ కోసం ఒక దేవాలయం నిర్మించారు. ఈ ఆలయ గోడలపై రామాయణ గాథను వివరించే చిత్రాలు ఉన్నాయి.





## పోలోన్నరువా

ఇది ప్రాచీన నగరం. వారసత్వ ప్రదేశం. ఇక్కడ ఎత్తయిన రాతిస్తంభాలు ఉన్నాయి. ఇవి ఒకప్పటి ప్రాచీన నిర్మాణాలకు సజీవ సాక్ష్యంగా నిలిచి ఉన్నాయి. నేటికీ ఈ ప్రాంతం గొప్ప సాంస్కృతిక వారసత్వ ప్రదేశంగా విరాజిల్లుతోంది. ఈ ప్రదేశాన్ని దక్షిణాది పెట్రా నగరం అని అనేకమంది అభివర్ణించారు. ఇక్కడ బౌద్ధ మతానికి చెందిన స్థూపాలు, స్థంభాలు, సమాధులు ఉన్నాయి. శ్రీలంక సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా ఉంటుందీ ప్రదేశం.

## యాలా జాతీయ అభయారణ్యం

యాలా వన్యప్రాణి సంరక్షణా అభయారణ్యం శ్రీలంకలోనే అతి పెద్ద జాతీయ ఉద్యానవనం. ఇది 900 చ.కి.మీ. మేరా విస్తరించి ఉండటంతో అనేక వన్యప్రాణులకు నిలయంగా మారిపోయింది. శ్రీలంక దక్షిణ తీరంలో నెలకొని ఉంది. ఏనుగులు, ఎలుగుబంట్లతో పాటు అనేక రకాల పక్షులను కూడా ఇక్కడ తిలకించవచ్చు. జంతు, పక్షి ప్రేమికులు ఎక్కువగా ఈ ప్రాంతానికి వస్తుంటారు. యాలా వన్యప్రాణి సంరక్షణా అభయారణ్యం శ్రీలంకలోనే అతి పెద్ద జాతీయ ఉద్యానవనం. పులులు, చిరుతలు, ఏనుగులు, ఎలుగుబంట్లతో పాటు అనేక రకాల జంతువులు, పక్షులను ఈ ఉద్యానవనంలో చూడవచ్చు. జీవ వైవిధ్యాన్ని ఇష్టపడేవారు ఈ ప్రాంతంలో అనేక కొత్త విషయాలు తెలుసుకొనే అవకాశం ఉంది.

## నువారా ఎలియా

అత్యంత అద్భుతమైన అందాల మధ్య నెలకొని ఉన్న ఈ ప్రదేశాన్ని ప్రేమగా 'లైట్ల నగరం', కాంతి నగరం, టేబుల్ ల్యాండ్ అని ఇత్యాది పేర్లతో పిలుస్తారు. ఇక్కడ పర్వతాలు, జలపాతాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. బ్రిటిషు వలసవాదుల కాలంలో ఇది ఒక రహస్య ప్రదేశంగా విరాజిల్లడంతో 'లిటిల్ ఇంగ్లాండ్' అనే సార్థక నామమేర్పడింది. ఇప్పుడు ఇది తప్పనిసరిగా సందర్శించాల్సిన ప్రదేశంగా మారింది.



## అనురాధపురం

శ్రీలంక పూర్వ రాజధానులలో ఒకటి అనురాధపురం. ప్రాచీన బౌద్ధ శిల్పకళా భాండాగారంగా ఇది భాసిల్లుతోంది. ఇక్కడ సింహళ నాగరికత అవశేషాలను తిలకించవచ్చు. ఎటు చూసినా చారిత్రక ఆనవాళ్లు కనిపిస్తాయి. పాండుకాభయుడనే రాజుచేత అనురాధపురం నిర్మితమైనట్లు తెలుస్తోంది.

అశోకుని కాలంలోనే సింహళ ద్వీపంలో బౌద్ధమత వ్యాప్తి జరిగింది. ఆ కాలంలో నిర్మించిన రాతి విగ్రహాలు నేటికీ సజీవ సాక్ష్యంగా ఉన్నాయి. అనురాధాపురం బౌద్ధ శిల్పాలు నేటికీ ప్రపంచ ప్రసిద్ధి చెందాయి. ఇటువంటి స్థూపాలు మన దేశంలో సాంచిలో కనిపిస్తాయి. తిష్యుడు ఆ కాలంలో ధూపారామద గోబాను నిర్మించాడు. సింహళ భాషలో ఈ స్థూపాన్ని దగోబా అంటారు. మన అమరావతి శిల్పాలను నిర్మించిన అనేకమంది శిల్పులు మహాదేవ భిక్షుని ఆధిపత్యంలో సింహళ దేశానికి వెళ్లి ఇక్కడ కొన్ని నిర్మాణాలు చేసినట్లు చరిత్ర చెబుతోంది. అశోకుని కాలంలో ఇక్కడ బోధివృక్షాలను నాటారు. ఇది ఇప్పటికీ ఉంది. గౌతమ బుద్ధునితో ముడిపడి ఉన్న బోధివృక్షం తిలకించడానికి అత్యంత ఆసక్తిగా అనేకమంది బౌద్ధులు ఇక్కడికి వస్తారు. ఇక్కడ అభయగిరి స్థూపం(బౌద్ధ విహారం), రువాన్‌వెలిసయ(బౌద్ధ అవశేషాలు) అత్యంత ప్రసిద్ధమైనది.

## జాఫ్నా కోట

జాఫ్నా కోట ఒక ఆసక్తికరమైన ప్రదేశం. 17వ శతాబ్దంలో పోర్చుగీస్‌వారు జాఫ్నా కోటను నిర్మించారు.

శ్రీలంకలో అతి ముఖ్యమైన హిందూ దేవాలయం నల్లూరు కందస్వామి ఆలయం ఈ పట్టణంలోనే ఉంది. జాఫ్నా మార్కెట్‌లో సాంప్రదాయ ఆహార పదార్థాలు లభిస్తాయి.

## మిహింతలే

శ్రీలంకలో బౌద్ధ మతానికి జన్మస్థలం మిహింతలే అని చరిత్రకారులు చెబుతున్నారు. బౌద్ధ యాత్రికులే కాక విభిన్న మతాలకు చెందినవారు ప్రతిరోజూ ఇక్కడకు వస్తుంటారు. ఈ ప్రదేశం చుట్టూ దట్టమైన పచ్చని అడవులతో నిండి ఉంది.

## గాలే

డచ్, పోర్చుగీస్, బ్రిటిష్ నిర్మాణ శైలుల సంపూర్ణ సమ్మేళనాన్ని ప్రదర్శిస్తూ 16వ శతాబ్దపు ఆకర్షణ అయిన గాలేను సందర్శించకుంటే శ్రీలంక పర్యటన అసంపూర్తిగా ఉంటుంది. గాలే పట్టణంలో బౌద్ధ పగోడా చూడదగింది. అద్భుతమైన ఈ నిర్మాణం చాలా ఎత్తులో కట్టారు. ఇక్కడి నుండి సాగర దృశ్యాలు రమణీయంగా కనిపిస్తాయి. సాగర తీరాన కొబ్బరిచెట్లు, ప్రకృతి రమణీయ దృశ్యాలు మనస్సును రంజింపచేస్తాయి. శిథిలమైన కొన్ని ప్రాచీన నిర్మాణాలు ఇక్కడ ఉన్నాయి. అప్పట్లో ఉపయోగించిన సుమారు రెండు వందల ఫిరంగులను ఇక్కడ చూడవచ్చు.

## ఆరుగం బే

ఇది శ్రీలంకలో ప్రసిద్ధ బీచ్. పర్యాటకులు ఇక్కడ సూర్యాస్తమయం తిలకించడానికి చాలా ఇష్టపడతారు. ఈ బీచ్‌లో నీలి సముద్ర జలాలు ఎంతో పారదర్శకంగా ఉంటాయి. కుటుంబ సమేతంగా ఆహ్లాదంగా గడపడానికి ఇక్కడకు ప్రజలు తండోపతండాలుగా వస్తుంటారు.

## ఆడమ్ శిఖరం

పర్వతంపై నిర్మించిన అద్భుత కట్టడమిది. బౌద్ధ తీర్థయాత్రికల అత్యంత పవిత్ర స్థలం. అయినప్పటికీ హిందూ, ముస్లిం, క్రైస్తవ అనే భేద భావం లేకుండా అందరూ ఇక్కడికి వస్తుంటారు. ఈ పర్వతం అధిరోహించడానికి 5,500 మెట్లను నిర్మించారు.

## ట్రింకోమలీ

ఇక్కడి బీచ్‌లలో నీటికి సంబంధించిన క్రీడలు అందుబాటులో ఉంటాయి. సముద్రంపై నీటి క్రీడలు ఆడాలనుకునే సాహస పర్యాటకులు ఇక్కడికి వస్తుంటారు. ప్రకృతిలో ఇమిడివున్న భూతల స్వర్గంలా ఈ ప్రాంతం రమణీయంగా ఉంటుంది. ఈ ప్రదేశం చుట్టుపక్కల అనేక బౌద్ధ ఆలయాలు కూడా ఉన్నాయి.

## కండలమ

కండలమ అనేది నిర్మలమైన గ్రామం. పరుగులు తీసే నగర జీవితానికి సుదూరంగా ప్రశాంతంగా గడపాలను కునేవారు ఇక్కడకు వస్తుంటారు. ఎటు చూసినా పచ్చదనం కనిపిస్తుందిక్కడ.

## తిస్స మహారమా

ఔత్సాహికులైన ఫొటోగ్రాఫర్లకు, విహంగ వీక్షణకు స్వర్గధామం లాంటి ప్రదేశం. తిస్సా వెవా అనే సరస్సు ఇక్కడ ప్రధాన ఆకర్షణ. ఇక్కడ అనేక స్థూపాలతో నిర్మితమైన ప్రదేశం ప్రపంచ బౌద్ధులను విశేషంగా ఆకర్షిస్తుంది.

స్వర్గ ద్వీపంగా పిలిచే బెంటోటా, సరదా ద్వీపంగా పిలిచే ఉల్పోత, ఆకర్షణీయమైన తీరంతో అలరారుతున్న ఉనావతునా బీచ్, హోర్టన్ మైదానాల జాతీయ ఉద్యానవనానికి చేరువలో ఉన్న ఓహియా సుందర గ్రామం... ఇలా శ్రీలంకలో ఒకదాన్ని మించి మరొకటి అనేలా వున్న ఎన్నో పర్యాటక ప్రదేశాలు ప్రపంచ పర్యాటకుల్ని విశేషంగా ఆకర్షిస్తున్నాయి. ●



# వారఫలం

శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్కురాలు
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్: 9849453449, 9440927795

## మేషం



అనుకూల ఫలితాలు గోచరిస్తున్నాయి. పెట్టుబడికి కావాల్సిన ధనం అప్పు చేస్తారు. రహస్యంగా చర్చలు సాగిస్తారు. అన్నీ మీరే అయ్యి సంస్థను ముందుకు నడిపిస్తారు. విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంటారు. ఆరోగ్య సూత్రాలకు ప్రాధ్యాతనిస్తారు. న్యాయబద్ధంగా నడచుకునే మీ నడవడిక వల్ల ఈ వారం ఎంతగానో లాభపడతారు. పుకార్లను నమ్మకండి.

## వృషభం



గతంలో దూరమైన వర్గం తిరిగి చేరువవుతుంది. టాక్స్‌లను సకాలంలో చెల్లించడం మంచిది. సేవకా సిబ్బంది/సహోద్యోగుల వల్ల ఇబ్బందులు ఏర్పడే సూచనలు న్నాయి. ఆధ్యాత్మిక కార్యక్రమాలకు దీక్షలను నిర్వహిస్తారు. కోర్టుతీర్పులు అనుకూలంగా ఉంటాయి. పాత బాకీలు తీరుస్తారు. ముఖ్యమైన సందర్భాల్లో మీదే పై చేయిగా ఉంటుంది.

## మిథునం



సాధారణ ఫలితాలు గోచరిస్తున్నాయి. ఎంతగానో శ్రమించి అంతంత మాత్రపు ఫలితాలు సాధిస్తారు. బ్యాంకు రుణాలు కలిసి వస్తాయి. ఆస్తుల పరిరక్షణ కష్టతరమవుతుంది. దైవం మీద భారం వేసి ముఖ్యమైన వ్యవహారాలు చక్కబెట్టుకుంటారు. రెండు పడవల మీద ప్రయాణం మంచిది కాదు. మీలోని ధైర్య సాహసాలు వెలుగు చూస్తాయి.

## కర్కాటం



శుభ కార్యాలు సానుకూలపడతాయి. విదేశాల నుండి విలువైన సమాచారం అందుకుంటారు. గృహం/వాహనం కొనుగోలు చేస్తారు. వ్యాపార విస్తరణా కార్యక్రమాలకు కోసం మీరు చేసే కృషి ఫలిస్తుంది. రుణం ఇవ్వడం, తీసుకోవడం రెండూ కలిసిరావు. వారాంతంలో జరిపే చర్చలు ముఖ్యమైన కార్యక్రమాలు సత్ఫలితాలను ఇస్తాయి.

## సింహం



మిశ్రమ ఫలితాలు పొందుతారు. ప్రతిబంధకాలను అధిగమించి పనులను సానుకూల పరచుకుంటారు. బ్యాంకు రుణాల విషయంలో సాంకేతిక లోపాలు చోటు చేసుకుంటాయి. విభేదాలు తారాస్థాయికి చేరుకోకుండా ఆదిలోనే పరిష్కరించుకుంటే మంచిది. ఊరటనిచ్చే సమాచారం వారాంతంలో తెలుసుకుంటారు. ఉచిత సలహాలిచ్చేవారు ఎక్కువవుతారు.

## కన్య



సాంకేతిక ఇబ్బందుల నుండి బయట పడతారు. ఆరోగ్య సమస్యలు తగ్గుముఖం పడతాయి. ఆదాయ, వ్యయాలలో సమతుల్యతను సాధించడానికి మీరు చేసే కృషి నామమాత్రపు ఫలితాలనిస్తుంది. కీలకమైన వ్యవహారాలలో ఏర్పడిన ప్రతిబంధకాలు తొలగిపోతాయి. ఇతరులకు ఆచరణ సాధ్యం కాని పనులను మీరు చేయగలుగుతారు.

## తుల



సంస్థాపరమైనటువంటి పురోగతి సాధించడానికి కీలమైన చర్చలు సాగిస్తారు. విలువైన సమాచారం తెలుసుకుంటారు. చురుగ్గా వ్యవహరిస్తారు. ప్రతి పనిని ఒక క్రమ పద్ధతిలో నిర్వహిస్తారు. ధనాని కన్నా వ్యక్తిగత గౌరవానికి అధిక ప్రాముఖ్యం ఇస్తారు. గతంలో ఒకరికిచ్చిన మాటను వారాంతంలో నెరవేరుస్తారు. వృత్తి, ఉద్యోగాల పరంగా స్థిరత్వం సాధిస్తారు. సంఘంలో మీ మాటకు విలువ పెరుగుతుంది.

## వృశ్చికం



సానుకూల ఫలితాలు సాధిస్తారు. దూర ప్రాంత వ్యవహారాలు ఫలిస్తాయి. రావాల్సిన ధనం చేతికంది వస్తుంది. అయితే అంతకు మించిన చెల్లింపులు చెల్లించాల్సి రావడం కష్టతరమవుతుంది. శత్రువులు మీపై చేస్తున్న దుష్ప్రచారం తిప్పికొడతారు. మీకంటూ ఓ ప్రత్యేకతను ఏర్పరచుకోవడానికి అవిశ్రాంతంగా కృషి చేస్తారు. మానసిక సంఘర్షణకు గురౌతారు. మారుతున్న సామాజిక పరిస్థితులు ఆలోచింపచేస్తాయి.

## ధనుస్సు



సాధారణ ఫలితాలు గోచరిస్తున్నాయి. పొదుపు పథకాలు పాటించడంలో వైఫల్యం చెందుతారు. మానసిక ప్రశాంతతకు భంగం కలిగించేలా కొన్ని సంఘటనలు చోటు చేసుకుంటాయి. మీ మంచితనమే మీకు శ్రీరామరక్ష. చాలా సందర్భాల్లో మీ అంచనాలు తారుమారు అవుతాయి. పెట్టుబడులు, కీలకమైన చర్చలు, ప్రయాణాల్లో నిదానంగా వ్యవహరించండి. వృత్తి, ఉద్యోగాల్లో మీ స్థాయి యథాతథం.

## మకరం



ముఖ్యమైన వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి. ఏ పని ఎందుకు చేస్తున్నారో మీకు తప్ప ఇతరులకు తెలియనివ్వరు. రాజకీయ నాయకులతో పరిచయాలు ఏర్పడతాయి. విలాసవంతమైన వస్తువులు కొనుగోలు చేస్తారు. మీలోని సృజనాత్మకత వెలుగు చూస్తుంది. పలువురు ప్రశంసించే విధంగా ఉంటుంది మీ నడవడిక. కుటుంబ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తారు. శుభ కార్య చర్చలు సాగిస్తారు.

## కుంభం



అనుకూల ఫలితాలు ఎక్కువగా సాగిస్తారు. నూతన వస్తువులు, వస్త్రాలు కొనుగోలు చేస్తారు. న్యాయపరమైన చిక్కుల్లో చిక్కుకున్న మీ వారిని రక్షించాల్సిన బాధ్యత మీ పైన పడుతుంది. ఇతరులకు మీ వంతు సహాయ సహకారాలు సంపూర్ణంగా అందిస్తారు. ఆర్థికంగా పూర్తి స్థాయిలో కాకపోయినా కొంతవరకు ఊరట చెందుతారు. కొత్త అవకాశాలు కలిసివస్తాయి.

## మీనం



అనుకూలంగా ఉంటుంది. ముఖ్యమైన కార్యక్రమాలను సకాలంలో పూర్తి చేస్తారు. మీ నిజాయితీని రుజువు చేసుకుంటారు. పరోపకారం బుద్ధి కలిగి వుంటారు. ఉచిత సలహాలు ఇవ్వడం, తీసుకోవడం రెండూ కలిసిరావు. వ్యాపారులకు లాభాలు రొటేషన్ల రూపంలో ఉంటాయి. సినీ, కళా సాంస్కృతిక రంగాల్లోనివారు జాగ్రత్తగా వ్యవహరించడం మంచిది. ఆరోగ్య సమస్యలను అధిగమించడానికి వైద్యుణ్ణి మార్పు చేస్తారు.

# పశ్చిమ వాయవ్యంలో సెప్టిక్ ట్యాంక్ ఉంటే?


వాస్తువార్త

వాస్తు విద్వాన్ సాయిశ్రీ

డా॥ దంతూరి పండరినాథ్

3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్

సెల్: 9885446501/9885449458




## పశ్చిమ వాయవ్యంలో సెప్టిక్ ట్యాంక్-అశుభం

ఇంటి నుండి ఎటువంటి పోటు లేకున్నప్పటికీ పశ్చిమ వాయవ్యంలో సెప్టిక్ ట్యాంక్ చెడు ఫలితాలనిస్తుంది. పశ్చిమంలో వీధి ఉన్నప్పుడు ఆ సెప్టిక్ ట్యాంక్ ఓవర్‌ఫ్లో పశ్చిమ వాయవ్యంగా వున్నట్లయితే చెడు ఫలితాల సాంద్రత తగ్గుతుంది. ఉత్తర వాయవ్యంగా ఉన్నట్లయితే తీవ్రతరమవుతుంది. **శుభా శుభ ఫలితాలు:** వ్యాజ్యాలు, ధన నష్టం, మానసిక రుగ్మతలు.

**Septic Tank in the West North-West-Unfavourable**

When the house does not have any kind of strike a septic tank in the West North-West gives unfavourable result. If there is a road to the West and if the overflow of the septic tank is towards West North-West the harmful effect gets reduced. If it is towards the North North-West it gets increased. **Result:** Litigation, expenditure and psychic disorders.

## పశ్చిమ వాయవ్యంలో సెప్టిక్ ట్యాంక్(పోటు)-అశుభం

ఇంటికి పశ్చిమ వాయవ్యంలో సెప్టిక్ ట్యాంక్ ఉండకూడదు. ఇంటి ఉత్తర గోడ పారు నుండి పశ్చిమ ప్రహరీ గోడకు తాడు లాగినప్పుడు అది సెప్టిక్ ట్యాంక్ మీదుగా పోతే అది పశ్చిమ వాయవ్య సెప్టిక్ ట్యాంక్ పోటుగా గుర్తించాలి. **శుభా శుభ ఫలితాలు:** శారీరక, మానసిక అనారోగ్యం, అప్రయోజకత్వం.

**Septic Tank in the West North-West(Strike)-Unfavourable**

There should not be a septic tank in the West North-West of a House. If a string, held straight from the boundary of the Northern wall of the house to the Western comopound wall, goes over the septic tank it should be considered as the strike of the West North-West septic tank. **Result:** Physical and mental illness, uselessness and obstacles.

## పశ్చిమం(ఉచ్ఛ స్థానం)లో సెప్టిక్ ట్యాంక్-అశుభం

ఇంటికి పశ్చిమంలో వున్న సెప్టిక్ ట్యాంకు, ఉచ్ఛ స్థానమైన పశ్చిమ వాయవ్యానికి దగ్గరగా ఉన్నప్పుడు ఏ విధమైన పోటు లేకపోయినప్పటికీ, ఉచ్ఛస్థానంలో వున్నప్పటికీ సత్ఫలితాలను ఇవ్వదు. ఇక్కడ వుండే సెప్టిక్ ట్యాంకుకు ఓవర్‌ఫ్లో సాధారణంగా పశ్చిమంగా ఉంటుంది. అలా వుంటే చెడు ఫలితాలు తీవ్రతరమవుతాయి.

**శుభా శుభ ఫలితాలు:** అనారోగ్యం, వ్యాజ్యాలు, ఆటంకాలు.

**Septic Tank in the West(High-grade location)-Unfavourable**

A septic tank to the West of the house and near to the high grade location of West North-West, which has no strike of any kind and is itself in the high grade location, does not give any favourable result. A tank situated like this normally has an overflow towards the West. This increases the harmful effects. **Result:** Ill health, litigation and obstacles.

## పశ్చిమం(మధ్యమంలో)లో సెప్టిక్ ట్యాంక్-అశుభం

పశ్చిమంలో సెప్టిక్ ట్యాంకు కూడా సత్ఫలితాలను ఇవ్వదు. ఇటువంటి ట్యాంకులు సాధారణంగా పశ్చిమ వీధులున్న ఇండ్లకు ఉంటాయి. పశ్చిమంలో ఓవర్‌ఫ్లో కూడా ఉంటే చెడు ఫలితాల సాంద్రత పెరుగుతుంది.

**శుభా శుభ ఫలితాలు:** వ్యాపార వ్యవహారాలలో అడ్డంకులు, నష్టాలు, అనారోగ్యం, ప్రమాదాలు వాటిల్లే సూచనలు.

**Septic Tankl in the West(in the middle)-Unfavourable**

A septic tank in the West does not give any favourable result. Such tanks are normally in houses having road to the West. If the overflow is also to the West the bad effect gets increased. **Result:** Obstacles in business dealings, losses, ill health and accidents.

## పశ్చిమం(నీచ స్థానం)లో సెప్టిక్ ట్యాంక్-అశుభం

పశ్చిమ మధ్య భాగం నుండి నీచ స్థానమైన పశ్చిమ నైరుతి వైపు సెప్టిక్ ట్యాంకు ఉన్నట్లయితే దానికి ఎటువంటి పోట్లు లేకపోయినప్పటికీ సత్ఫలితాలు ఉండవు. ఓవర్‌ఫ్లో పశ్చిమం లేక పశ్చిమ నైరుతి దిక్కుకు ఉంటే చెడు ఫలితాల




సాంద్రత పెరుగుతుంది. **శుభా శుభ ఫలితాలు:** వ్యాపార వ్యవహారాలలో నష్టాలు, అపజయాలు, నిరాసక్తత.

**Septic Tank in the West(Low-grade location)-Unfavourable**

If a septic tank is located between the middle of the West and the Low-grade location of West South-West and even when it does not have any kind of strike it does not give any favo urable result. If the overflow is towards the West or West South-West-West the harmful effect gets increased. **Result:** Losses in business dealings, eluding success and lack of interest.

# పదరంగం-7

కూర్పు: పోపూరి విశ్వనాథ్



## ఆధారాలు

### అడ్డం

1. శాశ్వతం కాదు (4)
4. అరవ భోజనం(మనమూ అంటాం) (3)
5. గ్రాంథికంలో విసనకర్ర (4)
6. కాళ్లకు పెట్టుకునేవి (4)
9. ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటి (5)
11. తడబడ్డ తెలంగాణా గవర్నర్ (4)
12. మిఠాయిపై వాలేది (2)
13. ఒక ప్రాంతపు మాండలికం (2)
15. అటునించి నమస్కారం (3)
17. విరివిగా అభివృద్ధి జరిగితే ఇలా పెరిగిందంటారు (6)
20. ఒక మసాలా అన్నం (3)
22. ఇక్కడి అన్నపూర్ణాదేవి ప్రముఖమైనది (4)
23. శుభకార్యాలలో కట్టేది (3)

### నిలువు

1. …. దైవమొకటి తలిచిందని సామెత(7)
2. ఉత్తరాఫ్రికాలోని ఒక దేశం (3)
3. బృహదీశ్వరాలయం ఉన్న ఊరు (4)
4. ఒక ప్రముఖ బౌద్ధ క్షేత్రం (4)
7. ఎముకమజ్జలో వచ్చే కేన్సర్ వ్యాధి (4)
8. రాజరాజ నరేంద్రుని కాలంలో జరిగిన చారిత్రక కథ (5)
10. 'అలనాటి దేవదాసు' పాత్రకు ప్రాణం పోసినవాడు (6)
14. బాధించడం, ఇబ్బంది పెట్టడం (4)
16. రాజులు మొదలైనవారికిచ్చే కానుక (4)
18. తూర్పుకు వ్యతిరేకం (4)
19. గాలివాన చప్పుడు పైకొచ్చింది (2)
21. పోలీసుల ఆయుధం (2)

## పదరంగం-5 జవాబులు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| వా1 | ర్త | | రా2 | హు | కే3 | తు | వు4 | లు | |
| రా | | వ5 | | | ల | | పా | | పి6 |
| హి7 | ర | ణ్య | క | శి | పు | డు | | న8 | ల్లి |
| | | ప్రా | | | శి | | పా9 | లు | |
| వ10 | రు | ణు | డు | | | చ్చు11 | | గు12 | ల్ల |
| ట | | లు | | మా13 | వి14 | చి | గు15 | రు | |
| ప16 | ద్దు | | గో17 | | న్న | | జ్జ | | ము18 |
| త్ర | | ఆ19 | ల | నా | పా | ల | న | | ధ్వా |
| శా20 | లు | వా | | | లు | | గూ21 | ఢ | చా |
| యి | | రా22 | టం | దు | | కు23 | ళ్ళు | | ర్య |


జవాబులు పంపించాల్సిన చిరునామా:
**పదరంగం** ఆదివారం వార్త, నం.396,
లోయర్ ట్యాంక్‌బండ్, హైదరాబాద్-500 080.


పేరు : ..............................


..............................

ఊరు : ..............................

# ఈ వారం కా‘ర్టూన్స్’


నా కవితలు కొన్ని వింటారా..?
మీవి నేను వింటాను గానీ..!!


..ఆ-ఛానల్ వాళ్లు నన్ను
లైవ్ డిబేట్‌కు పిలిచార్రా..!!


ఆడపిల్లలన్నెప్పి అప్పుడు అబార్షన్లు
చేయించాను... నా ఖర్మ అంతా..!!

# ఫోటో ఫీచర్



సంవత్సరం
పొడవునా పర్యాటకుల
సందడి కనిపించే ఈ ప్రదేశం
వియత్నాం-చైనా సరిహద్దుల్లోని బాన్
జియోక్-డెటియన్ జలపాతాల
సంగమం.



